ప్రజాశక్తి

ఆదివారం 12 ఫిబ్రవరి 2023 | 8 పేజీలు



ప్రకాశం



బాపట్ల

బాబుకు, టిడిపికి

ఎలాంటి సంబంధమూ లేదు..

- దొడ్డిదారిన సీఎం అయిన చంద్రబాబు
- ఆగష్టు నాటికి వెలిగొండ ద్వారా సాగునీరు
- మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్



ప్రజలతో మాట్లాడుతున్న మంత్రి సురేష్

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

నారా చంద్రబాబునాయుడుకు, టీడీపీకి ఎలాంటి సంబంధం లేదని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ ఆరోపించారు. శనివారం యర్రగొండపాలెంలోని చైతన్య నగర్‌లో గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ తిరిగి సంక్షేమ పథకాల బుక్‌లెట్‌ను అందిస్తూ ముందుకు సాగారు. చైతన్య నగర్‌వాసులు మంత్రి సురేష్ పై పూలవర్షం కురిపించారు. ఈ సందర్భంగా మంత్రి సురేష్ మాట్లాడుతూ చంద్రబాబు ఎన్టీ రామారావు కుమార్తెను పెళ్లి చేసుకున్న అనంతరం రాజకీయ భిక్ష పెట్టిన వ్యక్తినే వంచించి.. ఆ పార్టీని లాగేసుకోవడం ద్వారా దొడ్డి దారిన ముఖ్యమంత్రి అయ్యాడని ఆరోపించారు. ఎమ్మెల్యేగా కూడా గెలవలేని నారా లోకేష్ ఎమ్మెల్సీ ద్వారా మంత్రి పదవి పొందాడే తప్ప అతనిపై ప్రజల్లో విశ్వాసం లేదన్నారు. జీవోకి జుఓకు తేడా తెలియని లోకేష్ తన పాదయాత్రలో చేసే ప్రసంగాలతో టిడిపికి భారీ నష్టమే తప్పేలా లేదని, సొంత పార్టీ నాయకులే చెవులు కొరుక్కొంటున్నారని పేర్కొన్నారు. లోకేష్ పాదయాత్ర ద్వారా వైసీపీకి ముచ్చెమటలు పట్టడం లేదని, లోకేష్ నోటి తీరుతో ఎక్కడ కొంపలు ముంచుతాడోనని టీడీపీ నేతలకే ముచ్చెమటలు పడుతున్నాయన్నారు. 2024 ఎన్నికల్లో కుప్పంతో సహా 175 స్థానాల్లో విజయం సాధించడమే లక్ష్యంగా వైసీపీ ముందుకు సాగుతోందన్నారు. రానున్న ఎన్నికల్లో కుప్పం నుంచి పోటీ చేస్తే చంద్రబాబుకు ఓటమి ఖాయమని చెప్పారు. ఎవరెన్ని మాయమాటలు చెప్పినా వెలిగొండను నాలుగైదు నెలల్లో పూర్తి చేసి ఈ ఏడాది ఆగష్టు నాటికి రెండు టన్నెళ్ల ద్వారా రైతాంగానికి సాగునీరు అందిస్తామని చెప్పారు. కార్యక్రమంలో మాజీ ఏఎంసి చైర్మన్ ఒంగోలు మూర్తిరెడ్డి, ఎంపిపి దొంతా కిరణ్‌గౌడ్, జడ్పిటిసి చేదూరి విజయభాస్కర్, జిల్లా కోఆప్షన్ సభ్యుడు సయ్యద్ షాబీర్ బాషా, సర్పంచ్‌లు రామావత్ అరుణాబాయి, ఏకుల జయమ్మ ముసలారెడ్డి పాల్గొన్నారు.

ఎంపీ మాగుంట కుమారుడు

రాఘవరెడ్డి అరెస్టు



- ఢిల్లీ లిక్కర్ స్కాంలో ఏపీ నుంచి తొలి అరెస్టు ఇదే..
- సౌత్ గ్రూపులో కీలకంగా వ్యవహరించినట్లు ఆరోపణలు
- ఎంపీ ఆరోపణలకు అధిష్టానం మౌనంపైనా రాజకీయవర్గాల్లో చర్చ

ప్రజాశక్తి-ఒంగోలు బ్యూరో

ఢిల్లీ లిక్కర్ స్కాంలో ఈడీ పంజా విసురుతోంది. ఈ స్కాంలో ఉన్నవారిపై ఇటీవలే ఛార్జిషీటు దాఖలు చేసిన సంగతి తెలిసిందే. అందులో ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డితో పాటు ఆయన కుమారుడు రాఘవరెడ్డిని చేర్చారు. ఇప్పుడు అరెస్టుల పర్వం కొనసాగుతోంది. శనివారం నాడు ఆయన్ను అరెస్టు చేసినట్లు ఈడీ అధికారులు వెల్లడించారు. ఈ స్కాంకు సంబంధించి ఏపీలో తొలి అరెస్టుగా భావిస్తున్నారు. శుక్రవారం రాత్రి విచారణ పేరుతో అదుపులోకి తీసుకున్న ఆయన్ను శనివారం నాడు అరెస్టు చేసినట్లు అధికారికంగా వెల్లడించారు. కోర్టులో హాజరుపరిచారు. విచారణ కోసం పది రోజుల పాటు ఈడీ అధికారులు కస్టడీకి కోరినట్లు సమాచారం. ఏదేమైనా మాగుంట కుటుంబం ఈ వ్యవహారంలో చిక్కుల్లో పడిందనే చర్చ సాగుతోంది.

సౌత్‌గ్రూపులో మాగుంట కుమారుడు రాఘవరెడ్డి కీలకంగా వ్యవహరించారని ఈడీ అభియోగాలు మోపింది. ప్రతి సమావేశానికి ఆయన హాజరైనట్లు ఆధారాలున్నట్లు ఈడీ అధికారులు చెబుతున్నారు. రూ.100 కోట్ల డీల్‌లో ఈయన పాత్ర ఉన్నట్లు భావిస్తోంది. ఇప్పటికే పలుసార్లు విచారణలు చేసిన ఈడీ అధికారులు ఆయన్ను ఢిల్లీలోనే అరెస్టు చేశారు. గతంలోనూ మాగుంట నివాసాల్లో ఈడీ అధికారులు సోదాలు చేశారు. ఢిల్లీ, చెన్నయ్, నెల్లూరు నివాసాలు, కంపెనీల్లో ఈడీ అధికారులు తనికీలు నిర్వహించిన సంగతి తెలిసిందే. దీనిపై అప్పట్లో ఎంపీ మాగుంట శ్రీనివాసురెడ్డి ప్రత్యేకంగా విలేకర్ల సమావేశం ఏర్పాటు చేసి కావాలనే తమ కుటుంబాన్ని అభాసుపాలు చేసేందుకు ఇలాంటి ఆరోపణలు చేస్తున్నారని ఆరోపించారు. 70 ఏళ్లుగా తమ కుటుంబం మద్యం వ్యాపారం న్యాయబద్ధంగానే చేస్తుందని చెప్పారు. కుంభకోణాలకు ఎప్పుడూ పాల్పడలేదని ఆవేదన వ్యక్తం చేశారు. కొందరు తమను అప్రతిష్టపాలు చేసేందుకు చేస్తున్న కుట్రగా దీన్ని ఆయన ఇటీవల మీడియా సమావేశంలో చెప్పారు. కొద్దికాలం పాటు సద్దుమణిగిన వ్యవహారం మళ్లీ ఛార్జిషీటులో పేర్లు రావడంతో మళ్లీ చర్చకు తావిచ్చింది. పాలకపక్షంలోనూ దుమారం రేపింది. కేంద్రంలో బిజెపి ప్రభుత్వం అప్ నేతలపై కక్షసాధింపులో భాగంగా ఎంపీపైనా, ఆయన కుమారుడిపైనా కేసులు బనాయించిందనే ప్రచారం మాగుంట శిబిరం నుంచి వచ్చింది. నిజంగా బిజెపి కుట్రలో భాగంగా జరిగిందా? రాజకీయ వ్యూహమా? స్కాం జరిగి అందులో పాత్ర ఉందా? అనేదీ తేలాల్సి ఉంది. ఇక రాజకీయంగానూ ఇప్పటి వరకూ జిల్లాలో మాగుంట కుటుంబంపై ఎలాంటి ఆరోపణలు కూడా లేవు. నెల్లూరు జిల్లాకు చెందిన ఆయన కుటుంబం వ్యాపారాల్లోనే సంపాదించుకుని ఇక్కడ రాజకీయం చేస్తున్నారు. జిల్లాలో శింగరాయకొండ వద్ద పెరల్ డిస్టలరీస్ ఉంది. జూనియర్ కాలేజీలు ఏర్పాటు చేశారు. ఇక్కడ మాత్రం భారీ వ్యాపారాలు లేవు. రాజకీయంగానూ ఆయన పార్లమెంటు పదవికే పరిమితమవుతారు. జిల్లా రాజకీయాల్లో ముఖ్యంగా క్షేత్రస్థాయి వ్యవహారాలలో పెద్దగా జోక్యం చేసుకునేతత్వం కాదు ఆయనది. పెద్దమనిషి పాత్రలోనే కొనసాగుతున్నారు. ప్రస్తుతం ఢిల్లీ లిక్కర్ స్కాం వ్యవహారం మాత్రం ఆయనకు సవాలుగానే మారింది. ఆయన పేరు కూడా ఛార్జిషీటులో ఉంది. కుమారుడిని ఇప్పుడు అదుపులోకి తీసుకున్నారు. ఏపీలో ▶ 2లో

గుంటూరు ఛానల్ కోసం

రైతుల సుదీర్ఘ పోరాటం

- ఛానల్ పొడిగింపుతో 50 గ్రామాల రైతులకు, 48 వేల ఎకరాలకు మేలు



ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

ఉమ్మడి ప్రకాశం, గుంటూరు జిల్లాలలో నాగార్జున సాగర్ ఆయుకట్టు, కొమ్మమూరు కాలువ ఆయుకట్టు పరిధిలో చేరని రైతులు సుదీర్ఘకాలంగా తమ ప్రాంతాల భూములకు సాగునీరు, తమ గ్రామాలకు తాగునీటి కోసం గుంటూరు ఛానల్ పొడిగింపు కోరుతూ పోరాటం చేస్తూ వస్తున్నారు. ముఖ్యంగా పర్చూరు, పెదనందిపాడు, చిలకలూరిపేట, పత్తిపాడు ప్రాంత రైతాంగం తమ భూములకు సాగు నీటి కోసం గత 85 సంవత్సరాలుగా పోరాడుతున్నారు. దశాబ్దాల పోరాటం అనంతరం ఛానల్ పొడిగింపు కోసం 2019లో రూ.274 కోట్ల నిధులు మంజూరు అయ్యాయి. పనులు ప్రారంభమైతే ఈ మండలాలకు చెందిన 48 వేల ఎకరాలకు సాగునీరు, 50 గ్రామాల ప్రజలకు తాగునీరు లభిస్తుంది.

కృష్ణానదికి 40 మైళ్ళ దూరంలో అతి దగ్గరగా ఉన్న ఈ ప్రాంతం గత పాలకుల నిర్లక్ష్యానికి గురైంది. కృష్ణా జలాలు అందుబాటులోకి రాక, భూగర్బ జలాలు అడుగంటి, సాగు, తాగునీటి సమస్య పరిష్కారం కోసం గుంటూరు ఛానల్ పొడిగింపు కోరుతూ 1936 నుంచి రైతులు పోరాటం చేస్తున్నారు. ఈ మేరకు 1961లో ఛానల్ పొడిగింపుకు అసెంబ్లీలో తీర్మానం చేశారు. ఛానల్ పొడిగింపుతో పాటు కృష్ణా కాలువ వద్ద రెండు ఎత్తిపోతల పథకాలు,పెదనందిపాడు, వేలూరు వద్ద మరో రెండు ఎత్తిపోతల పథకాలు నిర్మించాలని ప్రతిపాదనలు చేశారు. కాగా తాడేపల్లి మండలం పొలకంపాడు వద్ద కృష్ణా కాలువ నుంచి గుంటూరు జిల్లాలోని యామర్రు వరకు గుంటూరు ఛానల్‌ను నిర్మించారు. యామర్రు నుంచి పర్చూరు మండలం గారపాడు వరకు ఛానల్‌ను పొడిగించాలని రైతులు కోరుతూ వచ్చారు. రైతుల డిమాండ్ మేరకు కదిలిన ప్రభుత్వం భూసేకరణ కోసం ఆదేశాలు జారీ చేయడం జరిగింది. ఈ ఛానల్‌ను పర్చూరు వరకు పొడిగించేందుకు 686 ఎకరాల భూసేరణ జరపాలని ఇందుకోసం రూ.113 కోట్ల వరకు నిధులు అవసరం అని అధికారులు అంచనా వేశారు. ఈ మేరకు పత్తిపాడు, పెదనందిపాడు, వట్టి చెరుకూరు ప్రాంతం వరకు భూ సర్వే పూర్తి చేశారు. పర్చూరు ప్రాంత భూ సర్వే జరగలేదు. పర్చూరు మండలంలో ఏదుబాడు, గర్నెపూడి, ఇనగల్లు గ్రామాల్లో కాలువ పొడిగింపు కోసం భూసేకరణ జరగాల్సి ఉంది.

రూ.274 కోట్లు మంజూరైనా..

రైతుల పోరాటం ఫలితంగా రెండేళ్ళ క్రితం రూ.330 కోట్ల అంచనాలతో పనులు ప్రారంభించనున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. రూ.274 కోట్ల నిధులు మంజూరు చేసి.. టెండర్లు పిలిచారు. 24 నెలల్లో పనులు పూర్తి చేయాలని నిర్ధేశించారు. కానీ పనులు ప్రారంభమే లేదు. ఈ గుంటూరు ఛానల్ ఏర్పాటు వలన 49 గ్రామాల పరిధిలో 48 వేల ఎకరాలకు సాగునీరు, ఆ గ్రామాలకు తాగునీరు లభిస్తుంది. ప్రధానంగా పర్చూరు మండలంలో 22 గ్రామాలకు సాగు, తాగునీరు ▶ 2లో

డిఇఒగా రమేష్

ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం



రమేష్ (ఫైల్)

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

ప్రకాశం జిల్లా విద్యాశాఖాధికారిగా పి.రమేష్‌ను నియమిస్తూ ప్రభుత్వం శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. డిఇఒగా పనిచేసిన బి.విజయభాస్కర్‌కు గతంలోనే సంయుక్త సంచాలకులుగా ఉద్యోగోన్నతి లభించింది. జెడిగా ఉద్యోగోన్నతి పొందిన విజయ భాస్కర్ డిఇఒగా విధులు నిర్వహిస్తున్నారు. పి.రమేష్ గతంలో నెల్లూరు జిల్లా డిఇఒగా పనిచేశారు.

ఇన్‌ఛార్జి మెప్మా పీడీగా అబ్దుల్ ఖాదర్



అబ్దుల్ ఖాదర్ (ఫైల్)

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

బాపట్ల జిల్లా ఇన్‌ఛార్జీ మెప్మా పీడీగా అబ్దుల్ ఖాదర్‌ని నియమిస్తూ ఎమ్‌డీ విజయలక్ష్మి శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. ఒంగోలు మెప్మా కార్యాలయంలో అడ్మినిస్ట్రేటివ్ అధికారిగా పనిచేస్తున్న అబ్దుల్ ఖాదర్ మెప్మా పీడీగా రానున్నారు. ఇప్పటి వరకు ఈ బాధ్యతల్లో ఉన్న రవికుమార్ ప్రకాశం జిల్లా మెప్మా పీడీగా కొనసాగుతారు.

పశువుల వ్యాపారులపై దాడులు అరికట్టాలి

ప్రజాశక్తి-మార్టూరు రూరల్

రైతుల నుంచి కొనుగోలు చేసిన పశువులను తరలిస్తున్న వ్యాపారులపై అక్రమ దాడులను అరికట్టాలని అఖిల భారత విప్లవ రైతు సంఘం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కార్యదర్శి మన్నవ హరిప్రసాద్ డిమాండ్ చేశారు. శనివారం ఏఐకెకెఎస్ కార్యవర్గ సభ్యులు మహ్మద్ బాషా ఆధ్వర్యంలో మార్టూరులో జరిగిన సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న అయన మాట్లాడుతూ.. ఆంధ్రప్రదేశ్ నుంచి దక్షిణాది రాష్ట్రాలైన తమిళనాడు, పాండిచ్చేరి, కేరళకు వ్యాపారులు రైతుల వద్ద నుంచి కొనుగోలు చేసి పశువులను పలువురు వర్తకులు, పశువుల పెంపకందారులు, రైతులు, లారీ యజమానులు, డ్రైవర్లు, పశువుల కాపరులు ప్రభుత్వ అనుమతితో గత కొన్ని సంవత్సరాలుగా పొరుగు రాష్ట్రాలకు తరలించి జీవనోపాధి పొందుతున్న నేపథ్యంలో గత రెండు సంవత్సరాలుగా కొన్ని సంఘ విద్రోహక శక్తులు మార్గమధ్యంలో ఈ వ్యాపారులను బెదిరించి వారిలో వద్ద నుంచి దౌర్జన్యంగా మామూళ్లు వసూలు చేయడం దారుణమన్నారు. వ్యాపారులలో ఎవరైనా మామూళ్లు ఇవ్వడానికి నిరాకరిస్తే వారిపై దాడులు చేయిస్తూ సమస్యలను సృష్టించి రవాణా జరగకుండా చేస్తున్నార న్నారు. కాషాయ మతోన్మాద మూకలచే పట్టుబడిన వాహనాలను పోలీసుల సహాయంతో బలవంతంగా గోశాలలకు, పశువుల శాలకు తరలిస్తుంటే పట్టించుకోవాల్సిన పోలీసు శాఖ, రవాణా శాఖ అధికారులు తమకెందుకులే అని వదిలివేయడం దారుణమన్నారు. అరాచక శక్తులు, స్థానిక గూండాలు పోలీసులతో జతకట్టి ఇతర రాష్ట్రాల వ్యాపారులను, ఆంధ్రప్రదేశ్‌లోని షెడ్యూల్ కులాలు, ముస్లిం మైనార్టీలకు చెందిన చిన్న వ్యాపారులను బెదిరించి చట్టాన్ని తమ చేతుల్లోకి తీసుకొని పశువులను తరలించే వాహనాల డ్రైవర్లపై భౌతిక దాడులు జరగ కుండా పోలీసులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అధికారులు ఇప్పటికైనా స్పందించి సరైన నిబంధనలతో పశువుల రవాణాకు రక్షణ కల్పించేలా చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, రవాణా జరుగుతున్న సమయంలో కాషాయ గూండాల దాడులను అరికట్టేలా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో తమిళనాడు సిపిఐ(ఎంఎల్) రెడ్ స్టార్ కేంద్ర కమిటీ సభ్యులు ఇనియన్, పశువర్తకుల లారీ యజమానులు - కార్మికుల సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి మహమ్మద్ జాగీర్, ఉప ప్రధాన కార్యదర్శి హంసా ఉమర్ ఫరూఖ్, రాష్ట్ర నాయకులు వికె సిరాజుద్దీన్, షేక్ సుబాని, మైలా చిన్న నాగేశ్వరరావు, మేకా ఇర్మియా, ఏఐఆర్‌డబ్ల్యూఓ రాష్ట్ర కార్యదర్శి సుజాత పాల్గొన్నారు.



విలేకరులతో మాట్లాడుతున్న అఖిల భారత విప్లవ రైతు సంఘం నాయకులు

కట్టెల ట్రాక్టర్ ఢీకొని వ్యక్తి మృతి

ప్రజాశక్తి-కొండపి: కట్టెల ట్రాక్టర్ బైకు ఢీకొని వ్యక్తి మృతి చెందిన సంఘటన పెదకండ్లగుంట గ్రామ పరిధిలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. శుక్రవారం రాత్రి పెదకండ్లగుంట గ్రామానికి చెందిన దాచర్ల కొండయ్య(63) అనే వ్యక్తితో పాటు అదే గ్రామానికి చెందిన మోరబోయిన వెంకటేశ్వర్లు కొండపి పట్టణంలో పనులు చేసుకొని తన స్వగ్రామానికి ద్విచక్ర వాహనంపై వెళుతున్న సందర్భంతో ఎదురుగా వస్తున్న వాహనం లైటుకు దారి అర్థం కాక కట్టెల ట్రాక్టర్‌ని ఢీకొట్టాడు. ద్విచక్ర వాహనం నడుపుతున్న దాచర్ల కొండయ్య ఛాతీకి ట్రాక్టర్ ట్రక్కు సైడు డోరు బలంగా తగిలింది. వెంకటేశ్వర్లుకు తీవ్ర గాయాలు అయ్యాయి. వెంటనే అటువైపు వెళుతున్నవారు 108కి సమాచారం అందించారు. వెంటనే 108 వాహనంలో కొండపి ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకొనివచ్చారు. కొండయ్య పరిస్థితి విషమంగా ఉండడంతో పాటు వెంకటేశ్వర్లుకు తీవ్రగాయాలు అయ్యాయి. వెంటనే అక్కడ నుంచి మెరుగైన వైద్యం కోసం రిమ్స్‌కు తరలించారు. అక్కడ నుంచి ఒంగోలులోని ఒక ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. దాచర్ల కొండయ్య చికిత్స పొందుతూ శనివారం ఉదయం మృతి చెందాడు.


కట్టెల ట్రాక్టర్ ఢీకొని మృతి చెందిన దాచర్ల కొండయ్య (ఇన్‌సెట్‌లో) దాచర్ల కొండయ్య (ఫైల్)


స్వాధీనం చేసుకున్న మద్యాన్ని పరిశీలిస్తున్న పోలీసు అధికారులు

బెల్టు షాపుపై పోలీసుల దాడి

ప్రజాశక్తి-అద్దంకి

అక్రమంగా మద్యం అమ్మకాలు జరుపుతున్న దుకాణంపై పట్టణ సీఐ ఎం రోశయ్య తన సిబ్బందితో దాడి చేసి ఓ వ్యక్తిని అదుపులోకి తీసుకున్న ఘటన శనివారం జరిగింది. పట్టణంలో భవాని సెంటర్ నుంచి సింగరకొండ వైపు వెళ్లే రోడ్డులో కొందరు వ్యక్తులు మద్యం అమ్మకాలు జరుపుతున్నారన్న సమాచారంతో దాడులు చేసి అదుపులోకి తీసుకున్నారు. అక్రమంగా మద్యం అమ్మకాలు జరుపుతున్న గౌస్ అనే వ్యక్తి నుంచి 20 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకొని గౌస్ అనే వ్యక్తిని స్టేషన్‌కు తరలించారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రభుత్వ భూమి 'రియల్ ఎస్టేట్'కు..

దర్జాగా అమ్మేసిన నాయకులు

ప్రజాశక్తి-సంతమాగులూరు

మండలంలోని వెల్లలచెరువు గ్రామానికి సంబంధించిన ప్రభుత్వ భూమి సర్వే నంబర్ 221/14 లో ఉన్న 1-30 సెంట్ల భూమిని, గ్రామంలో పలుకుబడి కలిగిన వ్యక్తులు, 15 లక్షల రూపాయలకు, అడ్డ రోడ్డుకు చెందిన రియల్ ఎస్టేట్ వ్యాపారికి అమ్మారు. ఈ భూమి వెల్లలచెరువు గ్రామ సమీపంలో గుంటూరు, కర్నూలు రహదారికి పక్కనే ఉండటంతో మంచి డిమాండ్ ఉంది. కొనుగోలు చేసిన రియల్ ఎస్టేట్ వ్యాపారి శనివారం ఉదయం మట్టితో చదును చేస్తుండగా, గమనించిన గ్రామ సర్పంచి షేక్ సైదాబీ, తహశీల్దారుకు, జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో రియల్ ఎస్టేట్ వ్యాపారి ఆ స్థలంలో పనులు ఆపాడు. ప్రభుత్వ భూమిని అమ్మడంలో గ్రామానికి సంబంధించి పదవీ విరమణ చేసిన గ్రామ కార్యదర్శి, విఆర్‌ఓ పాత్ర ఉందని గ్రామస్తులు చర్చించుకుంటున్నారు. మండలంలో ప్రభుత్వ భూములని చూడకుండా కొందరు పలుకుబడి కలిగిన వ్యక్తులు, రెవెన్యూ అధికారులకు ఎరవేసి రెండో కంటికి తెలియకుండా సొమ్ము చేసుకుంటున్నారని కొందరు తెలుపుతున్నారు. రెవెన్యూ అధికారులు స్పందించి అన్యాక్రాంతమైన ప్రభుత్వ భూములను గుర్తించి, స్వాధీనం చేసుకోవాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.


రియల్ ఎస్టేట్‌కు అమ్మిన ప్రభుత్వ భూమి ఇదే!

ఎంపీ మాగుంట కుమారుడు రాఘవరెడ్డి అరెస్టు

(మొదటిపేజీ తరువాయి)

మొదటి అరెస్టుగా పరిగణిస్తున్నారు. కుమారుడి అరెస్టు తర్వాత పరిణామాలు ఎలా ఉంటాయనే దానిపై పార్టీలోనూ చర్చ సాగుతోంది. స్కాంలో తమకు ఇరికించారనే ధోరణిలో మాగుంట మాట్లాడుతున్నారు. పార్టీ ఎంపీని ఇలా ఇరికిస్తే అధిష్టానం పాత్ర ఏమిటనేదీ స్పష్టత లేదు. సిఎం జగన్ ఈ వ్యవహారంలో జోక్యం చేసుకున్నారా? లేదా? అనేదీ తేల్లేదు. పార్టీ ఎంపీ అభిప్రాయాలను కేంద్రం దృష్టికి గానీ, ఈడీ అధికారుల దృష్టికి గానీ తీసుకుపోయారా? అన్నది స్పష్టత లేదు. జిల్లాలో పార్టీ ముఖ్యనేతలు కూడా ఈ వ్యవహారాలను ఆసక్తిగా చూస్తున్నారే తప్ప కేంద్రంపై ఎలాంటి ఆరోపణలు చేయడం లేదు. కేసుల్లో అనవసరంగా ఇరికించారని ఎంపీ ఆరోపిస్తున్నా ఇక్కడ నుంచి ఆయనకు మద్దతుగా ఎవరూ స్పందించడం లేదు. ఆయనే చూసుకుంటారనే భావనలో నేతలు కనిపిస్తున్నారు. ఈడీ కేసుల్లో ఉన్నందున నోరు విప్పితే ఎక్కడ సమస్య వస్తుందోనన్న ఆందోళన కూడా నేతల్లో కనిపిస్తోంది. జిల్లా రాజకీయాల్లో ఇదొక కీలక అంశంగా చర్చ సాగుతోంది.

రైతుల సుదీర్ఘ పోరాటం

(మొదటి పేజీ తరువాయి)

లభిస్తాయి. అలాగే చిలకలూరిపేట సమీపంలోని వేలూరు వద్ద ఉన్న చెరువును పూర్తి స్థాయిలో నింపి అక్కడ నుంచి పర్చూరు వరకు కాలువ ద్వారా ఎత్తిపోతల పద్ధతిలో నీరు పంపాలని ప్రతిపాదనలు చేశారు. గుంటూరు ఛానల్‌ను పొడిగించడం వలన సాగర్ ఆయుకట్టు మరియు కొమ్మమూరు కాలువ పరిధిలో చేరని వేలాది మెట్ట భూములకు సాగు నీరు అందుతుంది. ఆయా గ్రామాల ప్రజలకు తాగునీరు అందుతాయి. ప్రధానంగా గుంటూరు ఛానల్ పొడిగింపు కోరుతున్న గ్రామాల్లో తాగడానికి మంచినీరు లేని పరిస్థితి ఉంది. భూగర్భ జలాలు అడుగంటాయి. ఇలాంటి నేపథ్యంలో ఛానల్ పొడిగింపు ద్వారా 50 గ్రామాల రైతులకు, ప్రజలకు మేలు జరుగుతుంది. తాగునీరు, సాగునీరు, భూగర్భ జలాలు లేని పై ప్రాంతాలకు అతి దగ్గరగా ఉన్న కృష్ణా జలాలను తరలించి సుభిక్షం చేసి రైతాంగాన్ని ఆదుకోవాలని కోరుతున్నారు. గుంటూరు ఛానల్‌ను పర్చూరు వరకు పొడిగించే చర్యల్లో భాగంగా పర్చూరు మండలానికి నోటిఫికేషన్ ఇచ్చి, భూసేకరణ ప్రక్రియను ప్రారంభించి.. నిధులు కేటాయించాలని అఖిలపక్ష రైతుసంఘాల ఆధ్వర్యంలో బాపట్ల కలెక్టర్ విజయకృష్ణన్‌కు ఇటీవల వినతిపత్రం ఇచ్చిన విషయం తెలిసిందే..

పాస్టర్స్ యూనియన్ అధ్యక్షుడిగా విలియమ్స్

ప్రజాశక్తి-సంతనూతలపాడు రూరల్

సంతనూతలపాడు మండల నిస్సి పాస్టర్స్ యూనియన్ అధ్యక్షుడిగా జి విలియమ్స్‌ను ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షుడిగా ఏ లాజరు, కార్యదర్శిగా పి జాన్‌బాబు, కోశాధికారిగా రవికుమార్ జాయింట్ సెక్రటరీగా జాన్సన్, కార్యవర్గ సభ్యులుగా టీ ఫిలిప్స్, ఏ సమూయేలును ఎన్నుకున్నారు.

బైక్‌ను ఢీకొన్న ట్రాక్టర్.. వ్యక్తికి గాయాలు

ప్రజాశక్తి-చీరాల

ద్విచక్ర వాహనాన్ని ట్రాక్టర్ ఢీకొనడంతో వ్యక్తికి గాయాలయిన సంఘటన చీరాల మండలం జాండ్రపేట కూరగాయల మార్కెట్ వద్ద శనివారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కటారిపాలెం హరిజనవాడకు చెందిన ఎ వెంకటేశ్వర్లు విజయవాడ పోలీస్ క్లబ్‌లో హోంగార్డుగా విధులు నిర్వహిస్తున్నారు. శనివారం ఉదయం ద్విచక్ర వాహనంపై చీరాలకు బయలుదేరాడు. ఈ సమయంలో జాండ్రపేట కూరగాయల మార్కెట్ వద్దకు వచ్చేసరికి ఎదురుగా రాంగ్ రూట్లో కంకరలోడుతో వస్తున్న ట్రాక్టర్ ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టింది. దీంతో వెంకటేశ్వర్లుకు గాయాలయ్యాయి. క్షతగాత్రుడిని ఆటోలో స్థానికులు ఎక్కించి ప్రాంతీయ ఆసుపత్రికి పంపారు. ఈ మేరకు అవుట్ పోస్టు పోలీసులు బాధితుడి నుంచి వివరాలను నమోదు చేసుకున్నారు.

ఆటోను ఢీకొన్న ఆర్టీసీ బస్సు

- నలుగురికి గాయాలు.. ఒకరి పరిస్థితి విషమం
- మెరుగైన వైద్యం కోసం గుంటూరు తరలింపు

ప్రజాశక్తి-చీరాల

కూలీలతో ప్రయాణిస్తున్న ఆటోను ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో ఆటో డ్రైవర్ విల్సన్‌తో పాటుగా మరో ముగ్గురు కూలీలకు తీవ్ర గాయాలైన సంఘటన చీరాల-కారంచేడు రోడ్డులోని ఫ్రైడ్ స్కూలు వద్ద శనివారం జరిగింది. క్షతగాత్రులు తెలిపిన వివరాల ప్రకారం.. చీరాల నుంచి కారంచేడు వైపునకు కూలి పనుల కోసం వేమూరు మండలం చదలవాడకు చెందిన బి రోశయ్య, బి వెంకటేశ్వర్లు, సుధాకర్‌లు ప్రయాణిస్తున్న ఆటోను ఎదురుగా వస్తున్న ఆర్‌టిసి బస్సు ఢీకొంది. ఈ ప్రమాదంలో ఆటో పల్టీలు కొట్టగా అందులో ప్రయాణిస్తున్న ముగ్గురు కూలీలలో బి వెంకటేశ్వర్లుకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు గమనించి వెంటనే 108 వాహనానికి సమాచారం అందించారు. క్షతగాత్రులను అంబులెన్స్‌లో చీరాల ప్రభుత్వ వైద్యశాలకు తరలించి చికిత్స అందిస్తున్నారు.


ప్రమాదానికి గురైన ఆటో

సంఘటనా స్థలాన్ని చీరాల ఒకటో పట్టణ పోలీసులు పరిశీలించారు. అనంతరం వివరాలు సేకరించి దర్యాప్తు చేపట్టారు. అయితే వెంకటేశ్వర్లు పరిస్థితి విషమంగా ఉండటంతో ఆయనను మెరుగైన వైద్యం కోసం గుంటూరుకు తరలించారు.

కారు ద్విచక్ర వాహనం ఢీకొని వ్యక్తికి గాయాలు

ప్రజాశక్తి-నాగులుప్పలపాడు

కారు ద్విచక్రవాహనం ఢీకొని వ్యక్తికి తీవ్ర గాయాలయిన సంఘటన శనివారం మండలంలోని ఉప్పుగుండూరు సమీపంలోని మట్టిగుంట పంపు షెడ్డు వద్ద చోటు చేసుకుంది. వివరాల మేరకు బాపట్ల జిల్లా చిన్నగంజాం మండలం నీలాయపాలెంకు చెందిన గుడివాడ అంజయ్య (60) గుంటూరులో శుభ కార్యక్రమానికి ఉప్పుగుండూరు నుంచి ఈదుమూడి వైపు వెళుతున్నాడు. ఈ సమయంలో ఈదుమూడి గ్రామానికి చెందిన నాగులుప్పలపాడు మండల పరిషత్ మాజీ వైస్ ఎంపిపి కొండ్రగుంట రంగారావు తన కారులో ఉప్పుగుండూరు వైపు వస్తున్నాడు. మట్టిగుంట పంపుషెడ్డు వద్దకు రాగా ముందు ఉన్న ట్రాక్టరును క్రాస్ చేస్తుండగా ఎదురు వస్తున్న ద్విచక్ర వాహనాన్ని ఢీకొనడంతో అంజయ్య కిందపడి తలకు తీవ్రగాయాలయ్యాయి. వాహనంలో ఒంగోలు కిమ్స్‌కు తరలించారు. అక్కడ వెంటిలేటర్‌పై చికిత్స పొందుతున్నాడు. పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం.


తీవ్రంగా గాయపడిన వృద్ధుడు

మస్తాన్‌బీకి ఘన నివాళి

ప్రజాశక్తి-సంతనూతలపాడు రూరల్

సంతనూతలపాడు గ్రామానికి చెందిన మండల పరిషత్ మాజీ కో ఆప్షన్ మెంబర్ పఠాన్ హుస్సేన్‌ఖాన్ భార్య పఠాన్ మస్తాన్‌బీ(65) శనివారం తన నివాసంలో గుండెపోటుతో మరణించింది. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి బిఎన్ విజయ్ కుమార్ ఆమె మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. టిడిపి మండల అధ్యక్షుడు మద్దినేని హరిబాబు, తెలుగు యువత ముప్పరాజు శ్రీనివాసరావు, సాదినేని శ్రీరామమూర్తి, మైనార్టీ సెల్ షేక్ మగ్బుల్, టిడిపి నాయకులు బొడ్డు శంకర్, బి రాందాసు, వి అంకంశెట్టి పాల్గొన్నారు.



వివరాలు వెల్లడిస్తున్న ఇంకొల్లు సిఐ సూర్యనారాయణ

ఫోక్సో కేసులో నిందితుడు అరెస్టు

ప్రజాశక్తి-ఇంకొల్లు రూరల్

ఫోక్సో చట్టం పరిధిలో ఓ నిందితుడిని అరెస్టు చేసినట్లు ఇంకొల్లు సిఐ వి సూర్యనారాయణ వెల్లడించారు. చీరాల ఆదినారాయణపురానికి చెందిన చవట హేమంత్ అలియాస్ మున్నా ఆదినారాయణపురంలోని ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న 8వ తరగతి విద్యార్థినికి మాయమాటలు చెప్పి గత 8 నెలల నుంచి ఆ బాలిక వెంట తిరుగుతున్నాడన్నారు. విషయం తెలుసుకున్న బాలిక తల్లి బాలికను ఇంకొల్లులోని వాళ్ల అమ్మమ్మ వద్ద ఉంచారన్నారు. ఈ నెల 1వ తేదీన హేమంత్ మోటార్ సైకిల్‌పై ఇంకొల్లు వచ్చి బాలికకు మాయమాటలు చెప్పి బలవతంగా తీసుకువెళ్లాడన్నారు. వచ్చిన ఫిర్యాదు మేరకు ఇంకొల్లు సిఐ పర్యవేక్షణలో ఇంకొల్లు ఎస్ఐ షేక్ నాయబ్ రసూల్ దర్యాప్తు ప్రారంభించి హేమంత్‌ను అతని బైకును అదుపులోకి తీసుకొని పర్చూరు కోర్టుకు హాజరుపరిచారన్నారు. కేసులో ఉత్తమ ప్రతిభ కనబరిచిన ఇంకొల్లు సిఐ వి సూర్యనారాయణ, ఇంకొల్లు ఎస్ఐ షేక్ నాయాబ్ రసూల్, సిబ్బందిని బాపట్ల జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ అభినందించారు.


పాము కాటుకు గురైన ఉపాధి కూలీ పద్మావతి

'ఉపాధి' మహిళకు పాముకాటు

ప్రజాశక్తి-పంగులూరు

ఉపాధి హామీ పనికి వెళ్లి ఓ మహిళ పాము కాటుకు గురైన సంఘటన మండలంలోని కశ్యాపురం గ్రామంలో శనివారం జరిగింది. గ్రామానికి చెందిన కూకట్ల పద్మావతి ఉపాధి హామీ పనికి వెళుతోంది. ఎప్పటిలాగే శనివారం ఉదయం కూడా ఏడు గంటలకు ఉపాధి పనికి వెళ్లింది. పనిచేస్తుండగా పాము ఆమెను కాటు వేసింది. వెంటనే అక్కడ కూలీలు ఆమెను అద్దంకి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం వైద్యులు ఆమెకు వైద్య చికిత్సను అందిస్తున్నారు. మండలంలో గతంలో అనేక సందర్భాల్లో ఉపాధి కూలీలను పాములు కాటు వేసిన సందర్భాలు ఉన్నాయి. పని ప్రదేశాల్లో గత కొంతకాలం నుంచి ఫస్ట్ ఎయిడ్ బాక్స్ గాని, ఎలాంటి వైద్య సౌకర్యాలు గాని ఉండటం లేదు. దీంతో ఏవైనా ప్రమాదాలు జరిగినప్పుడు కూలీలు ఇబ్బంది పడుతున్నారు. అధికారులు ఇప్పటికైనా కూలీల దగ్గర వైద్య పరికరాలు ఉండే విధంగా చూడాలని పలువురు కోరుతున్నారు.

బ్లేడుతో కోసుకొని..
తీరంలో వ్యక్తి ఆత్మహత్యాయత్నం

ప్రజాశక్తి-చీరాల

జీవితంపై విరక్తితో ఓ వ్యక్తి పొట్టపై బ్లేడుతో కోసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఈ ఘటన మండలంలోని వాడరేవు సముద్రతీరంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పేరాలకు చెందిన టి సుబ్బారావు అనే వ్యక్తి చీరాల్లో ఓ మెడికల్ దుకాణంలో పనిచేస్తుంటాడు. కుటుంబంలో సమస్యల కారణంగా శనివారం ఉదయం వాడరేవు తీరం వద్దకు వెళ్లి అక్కడ తనతో తెచ్చుకున్న బ్లేడుతో పొట్టపై కోసుకుని చనిపోదామని సముద్రంలోకి వెళ్లాడు. గమనించిన స్థానికులు ఇతన్ని ఒడ్డుకు తీసుకొచ్చి 108కి సమాచారాన్ని అందజేశారు. 108 వాహనంలో క్షతగాత్రుడికి ప్రాథమిక చికిత్స చేస్తూ ఏరియా ఆసుపత్రికి తీసుకొచ్చారు. ఈ మేరకు ఇతని నుంచి అవుట్ పోస్టు పోలీసులు వివరాలను నమోదు చేసుకున్నారు.


ఆత్మహత్యా యత్నానికి పాల్పడిన టి సుబ్బారావు

ఇంటి కరెంటు బిల్లు రూ.14,424

ప్రజాశక్తి-మద్దిపాడు

ఓ సాధారణ ఇంటికి కరెంటు బిల్లు రూ.14,424 రావడంతో ఆ కుటుంబం బిత్తరపోయింది. ఇంత భారీగా విద్యుత్ బిల్లు రావడం ఏమిటని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. మండల పరిధిలోని నాగన్నపాలెం గ్రామానికి చెందిన రాతికింద అంజయ్య వ్యవసాయ కూలి. ఇతనిది మామూలు ఇల్లు. 43442000238 నంబర్‌తో కరెంటు మీటర్ ఉంది. ఆ ఇంటిలో లైట్లు, ఫ్యాన్లు తప్ప ఎలాంటి ఇతర వస్తువులు లేవు. అయినా రూ.14,424 కరెంట్ బిల్లు వచ్చింది. దీంతో ఒక్కసారిగా అవాక్కయ్యాడు. ఈయన ఎస్‌సి సామాజిక వర్గానికి చెందినవాడు. వీరికి 200 యూనిట్లు లోపు బిల్లు లేదు. గత అక్టోబర్, నవంబర్, డిసెంబర్ నెలలలో బిల్లు మామూలుగానే వచ్చింది. జనవరిలో ఇంత పెద్దమొత్తంలో బిల్లు రావడంతో ఖంగుతిన్నాడు. ఈ విషయమై బాధితుడు అంజయ్య ఏఇని కలువగా మీటర్ మారుస్తామని చెప్పారని, కానీ నేటికీ మార్చలేదని ఆవేదన వ్యక్తం చేశాడు. కాబట్టి ఈ బిల్లులను తక్షణం రద్దు చేసి మీటరును వెంటనే మార్చాలని బాధితుడు అంజయ్య కోరుతున్నాడు.




అధికంగా వచ్చిన కరెంటు బిల్లు

డ్రైవర్ల నిర్లక్ష్యంతోనే ప్రమాదాలు

ప్రజాశక్తి-పిసిపల్లి

పచ్చా(పొగాకు)కు ట్రాక్టర్లు డ్రైవర్ల నిర్లక్ష్యంతో ప్రమాదం పొంచి ఉంది. పొగాకు బ్యారెన్‌కు అవసరమైన కర్ర లోడ్లు తోలుకుపోయే సమయంలో, పొలం నుంచి పొగాకు బ్యారెన్ వద్దకు తీసుకెళ్లే సమయంలో డ్రైవర్ల నిర్లక్ష్యం మూలంగా ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. కర్ర లోడుతో వెళ్లే ట్రాక్టర్లు ఎదురుగా వస్తున్న వాహనాలను గుర్తించే విధంగా లైట్లు ఆపుతూ వేయకపోవడం వలన దగ్గరకు వచ్చే వరకు కర్ర లోడుగా గుర్తించలేకపోతున్నారు. ఈ విధంగా దగ్గరకు వచ్చి కర్ర లోడుగా గుర్తించి ఒక పక్కకు తిరగడం మూలంగా ద్విచక్ర వాహనాలు బోల్తా పడుతున్నాయి. నాలుగు చక్రాల వాహనాలు ఢీకొంటున్నాయి. ఉదయం పూట పొలం నుంచి పచ్చాకు బ్యారెన్ వద్దకు తీసుకెళ్లే సమయంలో డోర్లు తీసి ఉండడం, పెద్దపెద్ద సౌండ్‌తో టేపురికార్డులు పెట్టడం మూలంగా వెనుక నుంచి వచ్చే వాహనాలకు సైడు ఇవ్వకపోవడం వలన ప్రమాదాలు జరుగుతున్నాయి. మండలంలో ఇరుకు రోడ్లు, గతుకుల రోడ్లు ఉండడంతో పచ్చాకు ట్రాక్టర్‌ను తొలగేసి పోవాలన్నా ప్రమాదాలు జరుగుతున్నాయి. ట్రాక్టర్ పక్కకు తీయాలంటే వెనుక నుంచి వాహనాలు చేసే హారన్ శబ్దం వినపడనంతగా విధంగా పెద్దపెద్ద సౌండుతో పాటలు పెట్టుకోవడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. కొన్ని సందర్భాల్లో ప్రమాదాలకు కారణం అవుతున్నాయి. అదే విధంగా ప్రభుత్వం, అటవీశాఖ అనుమతులు లేని తెల్లతుమ్మ, చింత లాంటి కర్ర లోడ్లు తరలించే సమయంలో అధికారులు పట్టుకుంటారని వేగంగా తోలడం, ఆ సమయంలో డ్రైవర్లు ఆందోళనగా, హడావుడిగా ఉండడం వలన ఎదురుగా వచ్చే వాహనాలను గుర్తించకుండా వేగంగా వెళ్లడం వలన ప్రమాదాలు జరుగుతున్నాయి. వాల్టా చట్టం ప్రకారం ఎలాంటి చెట్లు నరకాలన్నా ప్రభుత్వ అనుమతి తప్పనిసరి. కానీ రైతుల అవసరాల కోసం కర్ర తరలించే సమయంలో అధికారులు ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారు. ఇందువలన ట్రాక్టర్ ఓనర్లు, డ్రైవర్లు కూడా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. ట్రాక్టర్లు నడిపే వారిలో అనేకమందికి డ్రైవింగ్ లైసెన్స్‌లు కూడా ఉండవు. ఎదురుగా వచ్చే వాహనాలు ప్రమాదాలకు గురికాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన లేకపోవడం వలన కూడా ప్రమాదాలు జరుగుతున్నాయి. వాహనాలను పర్యవేక్షించాల్సిన అధికారులు కూడా ట్రాక్టర్ల విషయంలో ఉదాసీనంగా వ్యవహరిచడం వల్ల ప్రమాదాలు జరగడంతోపాటు కుటుంబాలకు కుటుంబాలే వీధినపడుతున్నాయి.





ప్రమాదంలో నుజ్జునుజ్జు అయిన కారు
రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన వెంకటేశ్వర్లు (ఫైల్)

వెంకటేశ్వర్లు మృతితో.. దివాకరాపురంలో విషాదం

శుక్రవారం రాత్రి ట్రాక్టర్ ప్రమాదంలో చీమలదిన్నె వెంకటేశ్వర్లు(34) మృతి చెందడంతో దివాకరాపురంలో విషాదఛాయలు అలుముకున్నాయి. చిన్న వయస్సులో వెంకటేశ్వర్లు రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో గ్రామస్తులు ఆందోళన చెందున్నారు. మృతుడికి ముగ్గురు సంతానం. వీరంతా 10 సంవత్సరాల లోపు వారే. ఈ చిన్నారులు తండ్రితో అల్లారుముద్దుగా ఆడుకునేవారు. తండ్రి కనిపించకపోవడంతో ఆ చిన్నారులు తండ్రి ఏడి అని అడగటం తల్లి, నాయనమ్మ తండ్రి లేడని చెప్పలేని చెప్ప లేక పుట్టెడు దుఖంతో ఉండడటం వలన చూపురులను కన్నీటిపర్యంతమవుతున్నారు. మృతుడికి నాలుగు సంవత్సరాల క్రితమే తండ్రి చనిపోవడంతో ఆ కుటుంబంలో అన్నీ తానే అయ్యి కుటుంబాన్ని నెట్టుకొస్తున్నాడు. కుటుంబ పోషణ కోసం తెలంగాణకు వెళ్ళి బీల్దారి పనులు చేసుకుంటూ సొంత గ్రామమైన దివాకరపల్లికి పండుగలు, తిరునాళ్ళలు, బంధువుల శుభాకార్యాలకు వచ్చే వారు. ఇప్పుడు కూడా బంధువుల శుభకార్యానికి తెలంగాణ నుండి వచ్చారు. శనివారం సాయంత్రం తిరిగి తెలంగాణకు వెళ్ళాల్సి ఉంది. ఇంతలోనే ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. మృతుడికి వైఎస్ఆర్ గృహసారధుల మండల కన్వీనర్ శీలం సుదర్శనం, వెంగళాయపల్లి టిడిపి నాయకులు, ఉపసర్పంచికరణం వేమయ్య, సిపిఎం నాయకులు చీమలదిన్నె బాలంకయ్య తదితరులు వెంకటేశ్వర్లు మృతదేహాన్ని సందర్శించి సంతాపం తెలిపి కుటుంబ సభ్యులను పరామర్శించారు.

ఆశల పల్లకిలో వైట్‌బర్లీ రైతులు

ప్రజాశక్తి-పర్చూరు

వైట్ బర్లీ పొగాకు ధర ఆశాజనకంగా ఉండటంతో రైతుల్లో ఉత్సాహం వ్యక్తమవుతోంది. మొద వచ్చే అడుగు ఆకు ఎప్పుడూ ధర తక్కువగా ఉంటుంది. లోగడ గరిష్ఠంగా క్వింటాలు రూ.5 వేల వరకు కొనుగోలు చేశారు. ఈ ఏడాది ప్రస్తుతం ధర రూ.7 వేలు పలుకుతోంది. గత డిసెంబరులో తుఫాను కారణంగా ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షాలకు పొగాకు కొంత దెబ్బతింది. వర్షాల వల్ల నేలలో తేమశాతం ఎక్కువై పొగతోటలు ఉరకలెత్తాయి. రబీలో ఒకేసారి రైతులంతా పొగాకు వేసేందుకు తొందరపడటంతో ఎక్కువ ధర పెట్టి నారు కొనుగోలు చేయాల్సి వచ్చింది. ఎకరానికి మొక్కలు నాటేందుకు నారు కొనుగోలు కలిపి రూ.8 వేలు ఖర్చు పెట్టారు. మొక్కల ఎదుగుదల బాగుందన్న సమయంలో ఊహించని విధంగా వచ్చిన తుఫాను దెబ్బ తీసింది. వైట్ బర్లీ పొగాకు ధర గత సంవత్సరం ఆశాజనకంగా ఉండటంతో మళ్లీ నార్లు పెట్టి నాటారు. బాపట్ల జిల్లాలో వైట్ బర్లీ సాగు పర్చూరు సబ్ డివిజన్ పరిధిలోనే ఎక్కువగా ఉంటుంది. పెట్టుబడి భారంగా మారినా ధర సంతృప్తికరంగా ఉండటం వేరే పైర్లు సాగు అంతగా అనుకూలంగా లేకపోవటంతో పొగాకు వైపు రైతులంతా దృష్టి సారించారు. రైతులకు ఒక్కసారిగా నాటేందుకు ఆత్రుత పడటంతో నారు ధర అనూహ్యంగా పెరిగింది. నారు తొలుత రూ.2 వేల నుంచి రూ.2,500 వరకు ఉండగా తరువాత రూ.4 వేలకు పెరిగింది. మొక్కలు నాటేందుకు కూలీలకు ఎకరానికి రూ.4 వేలు చెల్లించారు. పర్చూరు వ్యవసాయ సబ్ డివిజన్‌లో సాధారణ సాగు విస్తీర్ణం 10,678 ఎకరాలు కాగా ఈ ఏడాది 12,483 ఎకరాల్లో సాగు చేశారు. పంట ఇంటికి వచ్చే సమయంలో ధర ఊహించని విధంగా ఎక్కువ ఉండటంతో రైతుల్లో ఆనందం వ్యక్త మవుతోంది. నాణ్యమైన పొగాకుకు క్వింటాలుకు రూ.10 వేలు ధర ఉంటుందని రైతులు చర్చించుకుంటున్నారు. లోగడ ఎన్నడూ లేని విధంగా పంట చేతికందే వరకు తుఫానులు, ప్రకృతి వైపరీత్యాలు సంభవించకుండా ఉంటే కష్టాల నుంచి కొంతవరకైనా బయట పడే అవకాశం ఉంటుందని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.




పర్చూరు వద్ద పందిళ్లకు కట్టిన పొగాకు తాళ్లు

బాపట్లలో దళిత క్రైస్తవుల సత్తా చాటుదాం

ప్రజాశక్తి-బాపట్ల

బాపట్ల నియోజకవర్గంలో దళిత క్రైస్తవ సామాజిక వర్గాలు రాజకీయల్లో తమ సత్తా చాటాలని బాపట్ల నియోజకవర్గం దళిత క్రైస్తవ సంఘాలు పిలుపునిచ్చాయి. శనివారం ప్రముఖ విద్యాదాత, సంఘ సేవకులు, బాపట్ల మాజీ పార్లమెంటు సభ్యులు దివంగత సలగల బెంజిమెన్ కుమారుడు సలగల రాజశేఖర్ బాబు ఆధ్వర్యంలో బాపట్ల టీచర్స్ కాలనీలో ఎలిజబెత్ బ్యారి హైస్కూలు ఆవరణలో ఏర్పాటు చేసిన దళిత క్రైస్తవుల ఆత్మీయ సమావేశంలో పలువురు ప్రసంగించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశానికి కర్లపాలెం మాజీ జెడ్‌పిటిసి సభ్యులు గుంపుల కన్నయ్య అధ్యక్షత వహించారు. రాజశేఖర్ బాబు మాట్లాడుతూ ప్రతి దళిత కుటుంబంలో తమ పిల్లలను ఉత్తమ విద్యావంతులుగా తీర్చిదిద్దేందుకు కృషి జరగాలన్నారు. విద్యతోనే ఎంతటి కార్యాన్నైనా సాధించగలమని పేర్కొన్నారు. ఆర్థికపరమైన అంశాలను ఉద్యమ స్ఫూర్తితో పరిష్కరించుకోలేకపోతే దళిత వర్గాలు తీవ్రమైన అగాధంలోకి వెళ్లిపోతాయన్నారు. రాజకీయ చైతన్యంతో వెనుకబడిన తరగతుల ప్రజల ప్రయోజనాలను రాజకీయ ఉద్యమాల ద్వారా కాపాడగలమన్నారు. రానున్న ఎన్నికల్లో విద్యాధికుడైన రాజశేఖర బాబును వచ్చే ఎన్నికల్లో బాపట్ల పార్లమెంటు అభ్యర్థిగా రంగంలో దించి క్రైస్తవులంతా సంఘటితమై రాజశేఖర్ బాబును పార్లమెంటు సభ్యుడిగా గెలిపించుకుని హస్తినకు పంపాలని సమావేశంలో ఏకగ్రీవంగా తీర్మానించారు. సమావేశంలో మోపర్తి జాన్, కాలింత దిలీప్ కుమార్, చింతా కిషోర్, యాతం మోజేస్, గ్లోరీ ఎనేట్, మద్దాల డేవిడ్, ఏపూరి భూపతిరావు, గొర్రెముచ్చు ఆనందరావు, పలువురు దళిత క్రైస్తవ సంఘాల నాయకులు పాల్గొన్నారు.





సంఘీభావం తెలుపుతున్న దళిత క్రైస్తవ సంఘాల నాయకులు, మాట్లాడుతున్న సలగల రాజశేఖర్ బాబు

అమర గాయకుడు ఘంటసాలకు నివాళి

ప్రజాశక్తి-బాపట్ల

తెలుగు చలనచిత్ర సంగీత జగత్తులో ఘంటసాల తనకు తానే సాటిగా సంగీత అభిమానుల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోయారని సప్తస్వర సంగీత కళాశాల ప్రిన్సిపాల్ కోటి రాజ్ అన్నారు. శనివారం అమర గాయకుడు ఘంటసాల 49వ వర్ధంతి సందర్భంగా సప్తస్వర సంగీత కళాశాల ఆధ్వర్యంలో ఘంటసాల చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా కోటిరాజ్ మాట్లాడుతూ శాస్త్రీయ లలిత సంగీతాలలో ఘనాపాటి ఘంటసాల అన్నారు. సినీ నటులు ఎన్టీఆర్, ఏఎన్నార్ నటనకు ఘంటసాల గాత్రం ఒక వరమని అన్నారు. తమ గానామృతంతో తన్మయపరచి సంగీత అభిమానుల హృదయాలలో చిరస్థాయిగా నిలిచారన్నారు. సాహితీ భారతి అధ్యక్షులు రావూరి నరసింహవర్మ మాట్లాడుతూ ఘంటసాల సినిమా పాటలే గాక కరుణశ్రీ రచించిన పుష్పవిలాపం, కుంతీకుమారి వంటి కావ్యాలను కూడా అద్భుతంగా గానం చేశారన్నారు. క్విట్ ఇండియా ఉద్యమంలో పాల్గొని రెండేళ్ళ అలీపూర్ జైలులో శిక్ష అనుభవించిన గొప్ప దేశభక్తుడని వివరించారు. కార్యక్రమంలో ప్రముఖ నటులు మస్తాన్‌రెడ్డి, సాహితీ భారతి కోశాధికారి ఆదం షఫీ, అల్లూరమ్మ, మర్రి మాల్యాద్రిరావు, ఎన్ కృష్ణ, ఎం జాకబ్, అవ్వారి వెంకటేశ్వర్లు, రెంటాల మురళి, రాధాకృష్ణమూర్తి, బొడ్డుపల్లి శ్రీరామచంద్రమూర్తి, పువ్వాడ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

అద్దంకి: అమర గాయకుడు ఘంటసాల వెంకటేశ్వరరావు 48వ వర్ధంతి కార్యక్రమాలు అద్దంకిలో ఘంటసాల గాన భారతి ఆధ్వర్యంలో శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముందుగా ఘంటసాల విగ్రహానికి ఘంటసాల గాన భారతి సెక్రెటరీ గోగులమూడి శేషగిరి ఆధ్వర్యంలో పూల మాలలు వేసి నివాళి అర్పించారు. ప్రముఖ సాహితీ విశ్లేషకులు అన్నమనేని వెంకటరావు మాట్లాడుతూ ఆయన పాట ఉన్నంతకాలం సజీవంగా ఉంటాడన్నారు. ఆయన భౌతికంగా మనమధ్య లేకపోయినా, ఆయన పాటతో మన మధ్య నిలిచారని తెలిపారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత ఉపాధ్యాయుడు విద్వాన్ చెన్నుపాటి రామాంజనేయులు, దాస భారతీయ జానపద కళాక్షేత్రం అధ్యక్షుడు చెన్నుపల్లి నాగేశ్వరరావు, ఖాజావలి, శ్రీనివాసరావు, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.



బాపట్లలో ఘంటసాల చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న దృశ్యం



అద్దంకిలో ఘంటసాల విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న దృశ్యం



వైద్య శిబిరంలో రోగులకు చికిత్సలు నిర్వహిస్తున్న వైద్యులు

ఈతేరులో వైద్య శిబిరం

ప్రజాశక్తి-బాపట్ల రూరల్

మండలంలోని ఈతేరు గ్రామ సచివాలయం పరిధిలోని గ్రామాల ప్రజలకు శనివారం వైద్య శిబిరం నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్ ద్వారా ఈ వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా అప్పికట్ల ప్రాథమిక కేంద్ర వైద్యాధికారి ఉస్మాన్ పలువురికి వైద్య పరీక్షలు నిర్వహించారు. 104 అంబులెన్సు సర్వీస్ ఇస్తూ దీనిలో షుగర్, బీపీ, ఆరోగ్య సేవలు అందించినట్లు తెలిపారు. ఉచితంగా మందులు అందించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌వి ప్రమీల, ఏఎన్ఎం, ఆశా కార్యకర్తలు, డీఈఓ సాయి పాల్గొన్నారు.



జగనన్న లే అవుట్లను పరిశీలిస్తున్న పిడి ప్రసాద్

గృహ నిర్మాణాలు వేగవంతం చేయాలి

ప్రజాశక్తి-మార్టూరు రూరల్

జగనన్న లేఅవుట్లలో అసంపూర్తిగా ఉన్న గృహ నిర్మాణాలతో పాటు, ఇంకా ప్రారంభించని గృహ నిర్మాణాలను వేగవంతంగా పూర్తిచేయాలని హౌసింగ్ పిడి ఏవీఎస్‌కె ప్రసాద్ అన్నారు. శనివారం మండల పరిధిలోని వలపర్ల, ఇసుకదర్శి గ్రామాలలోని జగనన్న లే అవుట్లను పరిశీలించిన పిడి ఇళ్ల లబ్ధిదారులు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఇంకా ప్రారంభం కాని గృహ నిర్మాణాలకు డ్వాక్రా గ్రూప్‌ల నుంచి మంజూరయ్యే రూ.35 వేలు నగదుతో బేస్‌మెంట్ నిర్మాణాలు లబ్ధిదారులు ప్రారంభించేలా సచివాలయ సిబ్బంది, విఓఏలు చర్యలు తీసుకోవాలని పిడి ఆదేశించారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ పిడి డాక్టర్ అర్జునరావు, హౌసింగ్ డీఈ మురళి, ఎఇ విజయానంద్, ఎంపిడిఓ గరికపూడి నితిన్, వలపర్ల పంచాయతీ కార్యదర్శి మోటుపల్లి శిరీష, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



క్రీడాకారులను సన్మానిస్తున్న కామాక్షి కేర్ హాస్పిటల్ వైద్యులు, ఎండి తాడివలస దేవరాజు

క్రీడాకారులకు 'కామాక్షి హాస్పిటల్' సన్మానం

ప్రజాశక్తి-చీరాల

చీరాలకు, బాపట్ల జిల్లాకు జాతీయ స్థాయిలో మంచి గుర్తింపు వచ్చే విధంగా క్రీడాకారులు కృషి చేసి పవర్ లిఫ్టింగ్‌లో గోల్డ్ మెడల్, స్ట్రాంగ్ ఉమెన్‌గా అవార్డు పొందిన క్రీడాకారులను బాపట్ల జిల్లా వెయిట్ లిఫ్టింగ్ అసోసియేషన్ చైర్మన్ డాక్టర్ తాడివలస దేవరాజు అభినందిస్తూ శనివారం చీరాల కామాక్షి కేర్ హాస్పిటల్ ఆవరణలో పవర్ లిఫ్టింగ్‌లో మెడల్స్ గెలుపొందిన క్రీడాకారులకు బాపట్ల జిల్లా పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ ప్రెసిడెంట్ చంద్రశేఖర్‌రెడ్డి అధ్యక్షతన సన్మాన కార్యక్రమం నిర్వహించారు. బాపట్ల పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ తరఫున డి అపర్ణ జెఎన్‌టియు, కాకినాడలో జరిగిన పవర్ లిఫ్టింగ్ కాంపిటీషన్‌లో గోల్డ్ మెడల్ సాధించి స్ట్రాంగ్ ఉమెన్ అవార్డు గెలుపొందారు. ఎస్ ద్వారక ఆచార్య నాగార్జున యూనివర్సిటీ పవర్ లిఫ్టింగ్ పోటీల్లో 76 కేజీల విభాగంలో బంగారు పతకం సాధించి స్ట్రాంగ్ ఉమెన్ టైటిల్ గెలుపొందారు. ఎస్ లక్ష్మి, టి వేదశ్రీ జగ్గయ్యపేటలో స్కూల్ గేమ్స్‌లో వివిధ విభాగాలలో జరిగిన పవర్ లిఫ్టింగ్ పోటీల్లో గోల్డ్ మెడల్ సాధించి స్ట్రాంగ్ ఉమెన్ టైటిల్ పథకాలు సాధించిన నలుగురు క్రీడాకారిణులకు పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ తరఫున కామాక్షి కేర్ హాస్పటల్‌లో శాలువాతో సన్మానించి అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కోచ్ అంజిరెడ్డి, జాయింట్ సెక్రెటరీ కోటా రాఘూరెడ్డి, అన్నదాత ప్రసాద్, ఎస్ నాగేశ్వరరావు, ఏవి ప్రసాద్ పాల్గొన్నారు.



39వ డివిజన్ సచివాలయ సిబ్బందితో మాట్లాడుతున్న కమిషనర్

పన్నుల వసూళ్ల కోసం
కమిషనర్ పర్యటన
బకాయిదారులను కలిసి.. త్వరగా చెల్లించాలని ఆదేశం

ప్రజాశక్తి-ఒంగోలు సబర్బన్

వసూలు కాని, పెండింగ్‌లో ఉన్న ఇంటిపన్ను, కొళాయి పన్ను గురించి నగరపాలక సంస్థ రెవెన్యూ విభాగం వారితో కలిసి కమిషనర్ వెంకటేశ్వరరావు గాంధీనగర్ సచివాలయం, శివప్రసాద్‌కాలనీ సచివాలయం, పీర్లమాన్యం సచివాలయ పరిధిలో శనివారం పర్యటించారు. గాంధీనగర్ సచివాలయ పరిధిలో ప్రశాంతి రెసిడెన్సీ వారితో మాట్లాడి, పెండింగ్ లో ఉన్న పన్నుల బకాయిలను వెంటనే చెల్లించాలని కోరారు. దీనికి వారు ఒక వారం గడువులో మొత్తం కడతామని కమిషనర్‌కు చెప్పారు. శివప్రసాద్‌కాలనీ పరిధిలో సరస్వతి జూనియర్ కాలేజీ యాజమాన్యంతో వసూలు కాని ఇంటి పన్ను మరియు కొళాయి పన్ను మొత్తం గురించి చర్చించి, వాటిని త్వరగా నగర పాలక సంస్థకి జమ చేయాలని కమిషనర్ కోరారు. దీనికి కాలేజీ యాజమాన్యం వారు వెంటనే స్పందించి, బకాయిలను ఐదు రోజుల లోపు కడతామన్నారు. అనంతరం పీర్లమాన్యం సచివాలయ పరిధిలో సాయిరామ్ అపార్ట్మెంట్స్ వారితో మాట్లాడారు. దీనికి అపార్ట్మెంట్ వారు స్పందించి బ్యాలెన్స్ మొత్తం త్వరలోనే చెల్లిస్తామన్నారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ఆయా సచివాలయ పరిధిలో గల బకాయిలు మొత్తం కూడా మార్చి 31 నాటికి వసూలు చేసేవిధంగా ప్రణాళికను రూపొందించుకోవాలని సచివాలయ సిబ్బందిని, నగరపాలక సంస్థ రెవెన్యూ విభాగం వారిని ఆదేశించారు.



డిఆర్‌ఒకు అర్జీ ఇస్తున్న నాయకులు

ఫేషియల్ యాప్ నుంచి మినహాయించాలి
సిఐటియు జిల్లా కార్యదర్శి గంటెనపల్లి శ్రీనివాసులు

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

ఫేషియల్ యాప్ నుంచి గ్రామ రెవెన్యూ సహాయకులను మినహాయించాలని సిఐటియు జిల్లా కార్యదర్శి గంటెనపల్లి శ్రీనివాసులు డిమాండ్ చేశారు. ఈ విషయమై ఎపి గ్రామ రెవెన్యూ సహాయకుల సంఘం ఆధ్వర్యంలో శనివారం డిఆర్‌ఓ ఓబులేష్ కలసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం విఆర్‌ఏలకు ఫేషియల్ యాప్ అటెండెన్స్ తీసుకోవాలని సర్క్యులర్ జారీ చేసిందని, దీంతో జిల్లాలోని 2000 మంది విఆర్‌ఏలు ఆందోళనకు గురవుతున్నారన్నారు. ఫేషియల్ యాప్ అటెండెన్స్ నుంచి విఆర్‌ఏలకు మినహాయింపు ఇవ్వాలని కోరారు. స్పందించిన డిఆర్‌ఒ ఓబులేసు మాట్లాడుతూ ప్రభుత్వం దృష్టికి తీసుకెళతానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సంఘం ప్రధాన కార్యదర్శి పి వివేకానంద, జిల్లా నాయకులు వేసపోగు చిన్నబ్బాయి, కలవకూరి బ్రహ్మయ్య, చింతకుంట్ల ఏసు, అంకయ్య, సాల్మన్ ,పవన్ కుమార్, నాగరాజు, బ్రహ్మయ్య. స్రవంతి పాల్గొన్నారు.

కాంగ్రెస్‌ను బలోపేతం చేసేందుకు కృషి: గంటా

ప్రజాశక్తి-బాపట్ల

బాపట్ల జిల్లాలో కాంగ్రెస్ పార్టీ మరింత బలోపేతం చేసేందుకు కృషి చేస్తున్నామని కాంగ్రెస్ పార్టీ బాపట్ల పార్లమెంటరీ జిల్లా అధ్యక్షులు గంటా అంజిబాబు అన్నారు. శనివారం జిల్లా కమిటీ నియామకం సందర్భంగా పట్టణంలో పటేల్ నగర్ ఆయన స్వగహంలో ఏర్పాటు చేసిన నూతన కమిటీ నియామక కార్యక్రమంలో అంజిబాబు మాట్లాడారు. కేంద్రంలో మోడీ, రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వాలు ప్రజలపై ఆర్థిక భారం మోపుతూ బూటకపు మాటలతో పబ్బం గడుపుతున్నారని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీతోనే దేశంలో, రాష్ట్రంలో సుపరిపాలన సాధ్యమవుతుందన్నారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ బాపట్ల జిల్లా కమిటీని అంజిబాబు ప్రకటించారు. బాపట్ల కాంగ్రెస్ పార్టీ కార్యాలయం ఇన్‌ఛార్జి, జిల్లా కార్యదర్శిగా శీలం సాగర్‌ను నియమించారు. జిల్లా ప్రధాన కార్యదర్శిగా సంతనూతల పాడుకు చెందిన కాంగ్రెస్ నాయకులు ఆదినారాయణను నియమించారు. కార్యక్రమంలో పఠాన్ రాజేష్ రాజేష్, బన్ని, రవి, ఇసాకు, దండే రేణుక, బక్కా రోశయ్య పాల్గొన్నారు.

'వెలిగొండ' ప్రాజెక్టును
గాలికి వదిలేసింది చంద్రబాబు కాదా.!
వైసిపి జిల్లా అధ్యక్షుడు జంకె వెంకటరెడ్డి

ప్రజాశక్తి-మార్కాపురం

పూలసుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్టుకు తాను ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో ముఖ్యమంత్రిగా చంద్రబాబునాయుడు శంకుస్థాపన చేసింది వాస్తవమేనని, కానీ ఆ తరువాత వెలిగొండకు నిధులు ఇవ్వకుండా గాలికి వదిలేసింది కూడా చంద్రబాబు కాదా.! అని వైసిపి జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే జంకె వెంకటరెడ్డి ప్రశ్నించారు. స్థానిక జవహార్‌నగర్ కాలనీలోని తన నివాస గృహంలో శనివారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వెలిగొండ ప్రాజెక్టు తానే ప్రారంభిస్తానని చంద్రబాబు చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. తాను ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో వెలిగొండను పూర్తి చేయాలని పదేపదే చంద్రబాబును కోరడం జరిగిందన్నారు. నిధులు లేవంటూ



మాట్లాడుతున్న జంకె వెంకటరెడ్డి

ప్రాజెక్టును పట్టించుకోలేదన్నారు. 2004లో డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి సిఎం హెూదాలో చంద్రబాబు వదిలేసిన వెలిగొండకు జీవం పోశారన్నారు. అప్పట్లో డాక్టర్ వైఎస్ఆర్ రూ.305 కోట్లు కేటాయించారన్నారు. వెలిగొండ ప్రాజెక్టు పనుల్లో 70 శాతం డాక్టర్ వైఎస్ఆర్ కాలంలో జరిగిన వేనన్నారు. డాక్టర్ వైఎస్ఆర్ తనయుడు ప్రస్తుత రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వెలిగొండ ప్రాజెక్టును తప్పక పూర్తి చేస్తారన్నారు. నిర్వాసితులను మెరుగైన ప్యాకేజితో ఆదుకుంటారన్నారు. 13 సంవత్సరాలు చంద్రబాబు అధికారంలో ఉండి కూడా వెలిగొండను పట్టించుకోలేదన్న విషయం అందరికీ తెలుసునన్నారు. కల్లబొల్లి మాటలతో ప్రజలను మభ్యపెట్టాలనుకోవడం చంద్రబాబు అవివేకమన్నారు. ఆయన మాటలు ఎవరూ నమ్మే స్థితిలో లేరన్నారు. వెలిగొండ ప్రాజెక్టును చంద్రబాబు కేవలం ఎన్నికల వాగ్దానంగా మాత్రమే వాడుకుంటున్నారన్నారు. ఇప్పుడూ అదే జరుగుతోందని ఎద్దేవా చేశారు. విలేకరుల సమావేశంలో వాల్మీకి కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ నలబోతుల కొండయ్య తదితరులు పాల్గొన్నారు.

లోక్‌అదాలత్‌లో 1290 కేసులు పరిష్కారం

ప్రజాశక్తి-అద్దంకి

అద్దంకి కోర్టు సముదాయంలో జాతీయ లోక్‌అదాలత్ కార్యక్రమంలో భాగంగా శనివారం 1290 కేసులను కక్షిదారులు రాజీ పడి.. పరిష్కరించుకున్నారని సీనియర్ సివిల్ జడ్జి బి.బాబునాయక్ వెల్లడించారు. ఈ నేషనల్ లోక్ అదాలతో దాదాపు రూ.2.5 కోట్ల ఆర్థిక లావాదేవీలు కేసుల ద్వారా జరిగాయి. సివిల్ 40, క్రిమినల్ 175, పెట్టీ కేసులు 1061 మరియు డివిసి రెండు, చెక్ బౌన్స్ కేసులు ఏడు.. వీటిలో కక్షిదారులు రాజీ పడ్డారని తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఎం బుజ్జప్ప, అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి ఎస్ ప్రియదర్శిని పాల్గొన్నారు.

చర్చలు లేకుండా ముగిసిన సమావేశం

ప్రజాశక్తి-దరిశి

దరిశి మండల సమావేశం ఎంపిపి గోళ్లపాటి సుధారాణి అధ్యక్షతన శనినారం జరిగింది. ఈ సందర్భంగా ఇన్‌ఛార్జి ఎంపిడిఒ గుత్తా శోభన్‌బాబు మాట్లాడుతూ ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున ఎలాంటి చర్చలు జరగకుండానే ముగించడమైనదని తెలిపారు. కార్యక్రమంలో వైస్‌ఎంపిపి కొరివి మునలయ్య, పిఆర్‌డిఇ విఠల్‌రాథోడ్, ఎంపిటిసిలు, సర్పంచులు, అధికారులు పాల్గొన్నారు.

పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థిని గెలిపించాలి
గ్రామ సేవకుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వివేకానంద

ప్రజాశక్తి - ఒంగో లు కలెక్టరేట్

రానున్న ఎమ్మెల్సీ ఎన్నికలలో పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి మీగడ వెంకటేశ్వర రెడ్డిని గెలిపించుకోవాలని ఎపి గ్రామ రెవెన్యూ సహాయకుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పి.వివేకానంద ఉద్యోగులను కార్మికులను కోరారు. స్థానిక సిఐటియు జిల్లా కార్యాలయంలో ఏపీ గ్రామ రెవెన్యూ సహాయకుల సంఘం ప్రకాశం జిల్లా కమిటీ సమావేశం శనివారం జరిగింది. సమావేశానికి కలవకూరి బ్రహ్మయ్య అధ్యక్షత వహించారు. ఈ సందర్భ ంగా ప్రధాన కార్యదర్శి వివేకానంద మాట్లాడుతూ ఉద్యోగులు కార్మికుల సమస్యలపై నిరంతరం పోరాడుతున్న పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి మీగడ వెంకటేశ్వర్ రెడ్డి అని తెలిపారు. రాష్ట్రంలో విఆర్‌ఏ జీతభత్యాలు పెరిగినా. ఇతర సమస్యలు పరిష్కారమైనా అందుకు పిడిఎఫ్ ఎమ్మెల్సీలు కారణమని



మాట్లాడుతున్న వివేకానంద

తెలిపారు. చిత్తూరు, నెల్లూరు, ప్రకాశం పట్టబద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా మీగడ వెంకటేశ్వరరెడ్డి పోటీ చేస్తున్నారని, జిల్లాలోని పట్టభద్రులు విఆర్‌ఏలుగా ఉన్న వారు, వాళ్ళ కుటుంబాల్లోని పిల్లలంతా ఆయనను బలపరచాలన్నారు. పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి మీగడ వెంకటేశ్వర్ రెడ్డిని గెలిపించుకోవడం ద్వారా వీఆర్‌ఏలకు ఉన్న సమస్యలు పరిష్కారం అవుతాయని కార్మికులను కోరారు. జిల్లాలో నామినీలుగా 500 మంది పనిచేస్తున్నారని, వేతనాలు పెంచాలని, ఇతర సమస్యలు పరిష్కారం కావాలని ముఖ్యమంత్రికి సంబంధిత అధికారులకు ఎన్నిసార్లు అర్జీలు ఇచ్చిన ఫలితం కనబడలేదన్నారు. పిడిఎఫ్ ఎమ్మెల్సీలను గెలిపించుకోవడం ద్వారా కొన్ని సమస్యలు పరిష్కారం అవుతాయని విఆర్‌ఏలకు పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో వేసపోగు చిన్నబ్బాయి చింతకుంట్ల ఏసు పాల్గొన్నారు.

కళాతపస్వి విశ్వనాథ్‌కు నృత్య కళాంజలి

ప్రజాశక్తి-ఒంగోలు

స్థానిక ఒంగోలులోని సి.వి.యన్. రీడింగ్ రూమ్ ప్రాంగణంలో శనివారం సాయంత్రం చందూ నృత్య అకాడమీ నిర్వాహకులు త్రోవగుంట చందూ ఆధ్వర్యంలో సుమారు 50 మంది చిన్నారులు కళాతపస్వి కె.విశ్వనాథ్‌కు తమ నృత్యాలతో కళాంజలి ఘటించారు. ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి.. ఘనంగా నివాళులు అర్పించారు. తదనంతరం కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా నాగభైరవ సాహిత్య పీఠం అధ్యక్షులు డాక్టర్ నాగభైరవ ఆదినారాయణ మాట్లాడుతూ కాశీనాథుని విశ్వనాథ్ గొప్ప తెలుగు సినిమా దర్శకుడని పేర్కొన్నారు. ప్రశస్తమైన సినిమాలను సృష్టించి.. తెలుగు సినిమాకు ఒక గౌరవాన్ని, గుర్తింపును తెచ్చిన వ్యక్తి అని కొనియాడారు. ఆయన సౌండ్ రికార్డిస్టుగా చిత్ర పరిశ్రమలో అడుగు పెట్టి, అక్కినేని నటించిన ఆత్మ గౌరవం సినిమాతో దర్శకుడిగా మారాడన్నారు. ఈ చిత్రానికి రాష్ట్ర ప్రభుత్వం నుంచి నంది బహుమతి లభించిందన్నారు. ఆయన సినీ జీవితంలో పేరెన్నికగన్న చిత్రం శంకరాభరణం అని, ఇది జాతీయ



చిన్నారులను అభినందిస్తున్న నిర్వాహకులు



నృత్యం చేస్తున్న చిన్నారులు

పురస్కారం గెలుచుకుందని తెలిపారు

కళామిత్రమండలి జాతీయ అధ్యక్షులు డాక్టర్ నూనె అంకమ్మరావు మాట్లాడుతూ భారతీయ కళల నేపథ్యంలో ఆయన తీసిన చిత్రాలు శంకరాభరణం, సాగరసంగమం, శృతిలయలు, సిరివెన్నెల, స్వర్ణకమలం, స్వాతికిరణం ప్రధామైనవని, సాంఘిక సమస్యలను ప్రస్తావిస్తూ ఆయన తీసిన చిత్రాల్లో సప్తపది, స్వాతిముత్యం, స్వయంకృషి, శుభలేఖ, ఆపద్బాంధవుడు, శుభసంకల్పం ముఖ్యమైనవని పేర్కొన్నారు. దర్శకుడిగా కాకుండా నటునిగా శుభసంకల్పం, నరసింహనాయుడు, ఆడవారి మాటలకు అర్థాలే వేరులే, ఠాగూర్, అతడు, ఆంధ్రుడు, మిస్టర్ పర్‌ఫెక్ట్, కలిసుందాం రా లాంటి ముఖ్యమైన చిత్రాలలో ఆయన నటించారని పేర్కొన్నారు. సినిమారంగంలో చేసిన కృషికి గానూ.. 2016లో ఆయన దాదాసాహెబ్ ఫాల్కే పురస్కారాన్ని, 1992లో రఘుపతి వెంకయ్య పురస్కారాన్ని అందుకున్నారని చెప్పారు. అదే సంవత్సరంలోనే పద్మశ్రీ పురస్కారం కూడా అందుకున్నారని, అందుకే కళాతపస్వి అనే బిరుదుకు ఆయన సార్థక నామధేయుడని అతిథులుగా పాల్గొన్న కె.బాలకోటయ్య, జి.సాగర్, కుర్రా ప్రసాద్ బాబు, మిడసల మల్లికార్జునరావు, డా.సంతవేలూరి కోటేశ్వరరావు, శ్రీమతి సింహాద్రి జ్యోతిర్మయి, జి.ఓబులరెడ్డి, నూకతోటి శరత్ తదితరులు విశ్వనాథ్‌ను ప్రశంసించారు.



హెపటైటిస్‌పై అవగాహన కల్పిస్తున్న డాక్టర్ వెంకటేశ్వర్లు

'విజయశ్రీ'లో ఉచితంగా హెపటైటిస్ పరీక్షలు

ప్రజాశక్తి-ఒంగోలు

దేవరకొండ సుబ్బయ్య మెమోరియల్ ఎడ్యుకేషల్ సొసైటీ మరియు విజయశ్రీ హాస్పిటల్ నిర్వాహకులు డాక్టర్ డి.వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో స్థానిక హాస్పిటల్‌లో ఉచిత హెపటైటిస్ శిబిరం శనివారం నిర్వహించారు. హెపటైటిస్ బి, సి వ్యాధులపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డాక్టర్ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ప్రతి నెలా రెండో శనివారం ఉచితంగా హెపటైటిస్ పరీక్షలు నిర్వహిస్తున్నా మన్నారు. అందులో భాగంగా 48 మందికి హెపటైటిస్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించగా.. అందులో ఇద్దరికి హెపటైటిస్ బి, ఒకరికి హెపటైటిస్ సి నిర్ధారణ అయ్యిందన్నారు. హెపటైటిస్ బి లేని 46 మందికి రాయితీపై వ్యాధి నిరోధక టీకాలు వేశామన్నారు.



నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే స్వామి

పెదకోటేశ్వరరావుకి ఎమ్మెల్యే నివాళి

ప్రజాశక్తి-జరుగుమల్లి

మండలంలోని సాధువారిపాలెం గ్రామానికి చెందిన మాజీ సర్పంచి కాకర్లమూడి పెదకోటేశ్వరరావు ఇటీవల గుండెపోటుతో మృతిచెందారు. శనివారం నాడు ఆయన దిశ దిన కర్మకు కొండపి ఎమ్మెల్యే డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి హాజరై.. నివాళులర్పించారు. నివాళు ర్పించిన వారిలో తెలుగుదేశం పార్టీ మండల కన్వీనరు పోకూరి రవీంద్రబాబు, పెదబాబు, కొమ్మాలపాటి కృష్ణ, మక్కెన శ్రీనివాసరావు, గ్రామ సర్పంచి కాకర్లమూడి యోహెను, రాయపాటి శేషయ్య, బత్తిన పూర్ణ చంద్రరావు, దగ్గుమాటి సుబ్బారెడ్డి, మాజీ ఎంపిపి పేముల విజయ నిర్మల, నవులూరి పూర్ణ వున్నారు.



ఆశీర్వదిస్తున్న ఉగ్ర నరసింహారెడ్డి

నూతన దంపతులకు మాజీ ఎమ్మెల్యే 'ఉగ్ర' ఆశీర్వాదం

ప్రజాశక్తి-హనుమంతునిపాడు

తెలుగుదేశం పార్టీ ఇన్‌ఛార్జి, మాజీ శాసనసభ్యులు డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి హనుమంతునిపాడు గ్రామంలో గాయం చెన్నారెడ్డి కుమారుడి వివాహ కార్యక్రమంలో, గంట నారాయణరెడ్డి కుమార్తె వివాహ కార్యక్రమంలో శనివారం పాల్గొన్నారు. నూతన వధూవరులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షులు సాని కొమ్ము తిరుపతిరెడ్డి, గంట శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీటీసీ ఉడుముల సుబ్బారెడ్డి, టిడిపి క్లస్టర్ ఇన్‌చార్జి దొడ్డ వెంకటసుబ్బారెడ్డి పాల్గొన్నారు.

చిన్నచిన్న గొడవలకే

పోలీస్‌స్టేషన్‌కు వెళ్లొద్దు

సీనియర్ సివిల్ జడ్జి ప్రసాద్

ప్రజాశక్తి-దరిశి

చిన్నచిన్న గొడవలకు పోలీస్ స్టేషన్‌లకు, కోర్టులకు వెళ్లవద్దని సీని యర్ సివిల్ జడ్జి, లోక్‌అదాలత్ చైర్మన్ జిఎల్‌వి.ప్రసాద్ అన్నారు. శనివారం జాతీయ లోక్‌అదాలత్ సందర్భంగా కోర్టులో కక్షిదారులతో ఆయన మాట్లా డారు. ప్రతి కేసునూ రాజీ చేసుకుంటేనే మంచిదన్నారు. కోర్టుకు వెళ్లి సమయం, డబ్బును వృథా చేసుకోవద్దన్నారు. లోక్‌అదాలత్‌లో మొత్తం 120 కేసులు పరిష్కారమైనట్లు తెలిపారు. కార్యక్రమం లో జూనియర్ సివిల్ జడ్జి బిఎల్ సరస్వతి, సంఘ సేవకులు జీవిరత్నం, న్యాయవాదులు చెన్నకేశవులు, ఆది నారాయణ, మనోరమ్మ, రంగా, రవి, సురేష్, ఎస్ఐలు రామక్రిష్ణ, సంపత్‌కుమార్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి ప్రసాద్

పేదల ఆర్థికాభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం

మాజీ ఎమ్మెల్యే కదిరి బాబూరావు

ప్రజాశక్తి-సిఎస్‌పురం

పేదల ఆర్థికాభివృద్ధే సిఎం వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి ప్రధాన ధ్యేయమని మాజీ ఎమ్మెల్యే, వైసిపి కావలి నియో జకవర్గ పరిశీలకులు కదిరి బాబురావు అన్నారు. శనివారం మండలంలోని శీలంవారిపల్లిలోని కదిరి క్యాంపు కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని వర్గాలను దష్టిలో పెట్టుకొని రాజకీయ పార్టీలకు అతీతంగా కుల, మత వివక్ష లేకుండా సిఎం జగన్మోహన్‌రెడ్డి నవరత్నాల ద్వారా సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారన్నారు. రాష్ట్రం అభివద్ధి చెందాలంటే 2024లో తిరిగి సిఎంగా వైఎస్ జగన్మోహన్‌రెడ్డిని గెలిపించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. సమావేశంలో మాజీ ఎఎంసి డైరెక్టర్ ఇర్ల వీరాంజనేయులు, మాజీ ఎంపిటిసి ఎం.కాశిరెడ్డి, ఇర్ల వెంకటేశ్వర్లు, బోయల్ల వెంకటరెడ్డి, నున్న నారాయణ, ఇర్లమాల్యాద్రి, ఏడుకొండలు, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే కదిరి బాబూరావు

యుటిఎఫ్ రూరల్ కార్యవర్గ ఎన్నిక ఏకగ్రీవం

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

యుటిఎఫ్ ఒంగోలు రూరల్ శాఖ కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నికైంది. స్థానిక యుటిఎఫ్ జిల్లా కార్యాలయంలో శనివారం ఒంగోలు రూరల్ శాఖ కౌన్సిల్ సమావేశం జరిగింది. కౌన్సిల్‌లో ఎన్నికల అధికారిగా ఎన్.చిన్న స్వామి, డి.వీరాంజనేయులు వ్యవహరించారు. గౌరవాధ్యక్షులుగా పి.శ్రీనివాసులురెడ్డి, అధ్యక్షులుగా దార్ల శ్రీనివాసులు, సహాధ్యక్షులుగా కె.వీరనారాయణ, ఆర్‌జి కృష్ణకుమారి, ప్రధాన కార్యదర్శి బి.సోమసుందరరావు, కోశాధికారిగా ఎం.వెంకటేశ్వర్లు ఎన్నికయ్యారు.

వైసిపి సోషల్ మీడియా కన్వీనర్‌గా లక్ష్మిరెడ్డి

ప్రజాశక్తి-పెద్దారవీడు



సిఎం జగన్‌తో లక్ష్మీరెడ్డి

వైసిపి యర్ర గొండపాలెం నియో జకవర్గ కన్వీనర్‌గా ఒద్దుల లక్ష్మీరెడ్డిని నియమిస్తూ శని వారం రాష్ట్ర వైసీపీ కార్యాలయం ప్రక టించింది. ఈ సందర్భంగా ఒద్దుల లక్ష్మీరెడ్డిని మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ అభినందించారు. నియోజకవర్గంలో సోషల్ మీడియాలో నూతన ఉత్తేజం కనబరచాలన్నారు. నియోజకవర్గంలోని పలువురు నాయకులు లక్ష్మీరెడ్డికి అభినందనలు తెలిపారు. ఇది వరకు లక్ష్మీరెడ్డి విద్యార్థి విభాగం నాయకులుగా పనిచేశారు. ఈ సందర్భంగా తనపై నమ్మకంతో సోషల్ మీడియా బాధ్యతలు అప్పగించిన సీఎం జగన్మోహన్‌రెడ్డికి, మంత్రి ఆదిమూలపు సురేష్‌కి లక్ష్మిరెడ్డి కతజ్ఞతలు తెలిపారు.



శ్రీనివాసరావు

చీమకుర్తి: వైసిపి పట్టణ సోషల్ మీడియా కన్వీనర్‌గా గోసి శ్రీనివాసరావు నియమితులయ్యారు. కో కన్వీనరుగా ముత్యాల పవన్‌కుమార్, బత్తుల అశోక్, దొంతు హరి, కృష్ణ, బోడిపోగు యోహాన్‌లను నియమించారు. ఈ సందర్భంగా కన్వీనర్ గోసి శ్రీనివాసరావు మాట్లాడుతూ తనపై నమ్మకంతో నియమించిన జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, ఎమ్మెల్యే టిజెఆర్.సుధాకరబాబు, మాజీ ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాదరెడ్డిలకు కృతజ్ఞతలు తెలిపారు.

గుండెపోటుతో హైస్కూల్ అటెండర్ మృతి

ప్రజాశక్తి-దరిశి

మండలంలోని పొతకమూరు జిల్లాపరిషత్ హైస్కూల్‌లో అటెండరుగా పనిచేస్తున్న ఎ.రాహేలమ్మ(60) గుండెపోటుతో శనివారం మృతిచెందారు. ముండ్లమూరు మండలంలోని చింతలపాలెంలో ఎ.రాహేలమ్మ స్వగృహానికి హెడ్‌మాస్టరు ప్రసాద్ వెళ్లి మృతదేహానికి పూలమాలలు వేసి.. నివాళులర్పించారు. ఆమె కోడలు లింగమ్మకు రూ.11,116 ఆర్థిక సాయం అందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు లివింగ్‌స్టన్, బాలక్రిష్ణారెడ్డి, తిరుపాలురెడ్డి, ఎలిశమ్మ, సిఆర్‌పి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

స్నేహభావం పెంపొందేందుకు ఆటలు దోహదం

ప్రజాశక్తి-శింగరాయకొండ

విద్యార్థి దశలో ఆటల ద్వారా స్నేహాలు మొదలవు తాయని శింగరాయకొండ సిఐ దాచేపల్లి రంగనాథ్, ఎస్ఐ ఫిరోజా ఫాతిమా అన్నారు. శనివారం నాడు శింగరాయకొండ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రాంగణంలో భాష్యం విద్యాసంస్థల ఆధ్వర్యంలో ఆటల పోటీలు నిర్వహించారు. ఉదయం ఎస్ఐ ఫిరోజా ఫాతిమా ఈ ఆటలను ప్రారంభించారు. అనం తరం జరిగిన సభలో ప్రసంగించారు. శనివారం రాత్రి ముగింపు క్రీడలకు సిఐ దాచేపల్లి రంగనాథ్ హాజరై.. విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. ప్రస్తుతం ఉన్న పరిస్థితుల్లో విద్యార్థులకు క్రీడలు చాలా అవసరమని వివరించారు. ప్రతి విద్యార్థీ స్నేహపూరితమైన క్రీడలతో ముందుకు పోవాలని వివరించారు. శింగరాయకొండ, టంగుటూరు, కావలి భాష్యం విద్యాసంస్థల బ్రాంచీల నుంచి విద్యార్థులు హాజరై ఆటల్లో పాల్గొన్నారు. రన్నింగ్, ఖోఖో, కబడ్డీ, వాలీబాల్, షాట్‌పుట్, లాంగ్ హైజంప్ పోటీల్లో విద్యార్థులు పాల్గొన్నారు. కార్యక్రమంలో భాష్యం జడ్ఇఓ గణేష్, శింగరాయకొండ ప్రిన్సిపాల్ జయకష్ణ, టంగుటూరు ప్రిన్సిపాల్ ఖాదర్ భాషా, కావలి ప్రిన్సిపాల్ రాజేష్, వైస్ ప్రిన్సిపాల్ కొనికి రమేష్, పీడీ ఎన్వీప్రసాద్, హరినాథ్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎస్ఐ ఫాతిమా



ఖోఖో ఆడుతున్న అబ్బాయిలు



వాలీబాల్ ఆడుతున్న బాలికలు

అమ్మో.. ఆ బస్సులా?

- శ్రీశైలం ఘాట్ రోడ్డులో కాలం తీరిన ఆర్‌టిసి బస్సులు
- గమ్యస్థానానికి చేరుకోవడానికి ప్రయాణికుల అవస్థలు

ప్రజాశక్తి-వేటపాలెం

కాలం తీరిన ఆర్‌టిసి బస్సులు ప్రయాణికులకు చుక్కలు చూపిస్తున్నాయి. శివదర్శనం కోసం వెళ్లిన ప్రయాణికులకు చుక్కలు కనపడ్డాయి. ఆరేడు గంటల ప్రయాణ సమయమంతా ప్రాణాలు గుప్పెట్లో పెట్టుకొని ప్రయాణించారు. వివరాల్లోకి వెళితే... గత సోమవారం ఉదయం వేటపాలేనికి చెందిన జాగాబత్తుని శ్రీనివాసరావు అనే వ్యక్తి శ్రీశైలంకు చీరాల డిపోకు చెందిన ఆర్‌టిసి బస్ ఎక్కి బయలుదేరారు. బస్ శ్రీశైలం ఘాట్ రోడ్డుకు చేరగానే మొరాయించింది. ఎంతసేపటికి బస్ బాగు కాకపోవడంతో అదే దారిలో వెళ్లే మరో ఆర్‌టిసి బస్సులోకి ప్రయాణికులను ఎక్కించి పంపారు. మంగళవారం తిరుగు ప్రయాణంలోనూ ఘాట్ రోడ్డును బస్సు ఎక్కలేక మొరాయించింది. చేసేది లేక డ్రైవర్ బస్సును ఆపి ఇంజిన్‌లో నీళ్ళు పోసి కొద్దిసేపు తరువాత బస్‌ను పోనిచ్చారు. దేవుడి దర్శనం కోసం వస్తే ఏందయ్యా ప్రయాణికులను ముప్పుతిప్పలు పెడుతున్నారని ఆర్‌టిసి సిబ్బందిని నిలదీశారు. దూరాభారం, అదీ ఘాట్ సెక్షన్‌లో వెళ్లే బస్సులు ఇలాంటి వాటిని కేటాయిస్తే తాము మాత్రం ఏమి చేయగలమని సంబంధిత ఆర్‌టిసి సిబ్బంది చిన్నబుచ్చుకున్నారు. స్థానికుడు శ్రీనివాసరావు వెంటనే చీరాల ఆర్‌టిసి డిపో మేనేజర్ శ్యామలకు బస్ నుంచే చరవాణి ద్వారా ఫిర్యాదు చేశారు. ప్రయాణికుల ప్రాణాలతో ఆటలాడుకోవద్దని ప్రాధేయపడ్డారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ప్రతి సంవత్సరం కొత్త బస్సులు కేటాయించాల్సి ఉండగా ప్రభుత్వం నుంచి నూతన బస్సుల మాట లేకపోవడంతో పాతవాటినే మరమ్మతులు చేసి రన్నింగ్‌లో పెడుతున్నారు. ఎలాంటి ప్రమాదాలు జరగకుండానే ముందుగానే చీరాల ఆర్‌టిసి డిపో అధికారులు మేల్కొని మంచి కండిషన్ కలిగిన బస్సులను నడపాల్సిన అవసరం ఎంతైనా ఉందని ప్రజలు కోరుతున్నారు.





చీరాల నుంచి శ్రీశైలం బస్ టికెట్, మొరాయించిన బస్సు


బస్సు కండీషన్‌లో ఉంటేనే బయటకు పంపుతాం
జంజనం శ్యామల, ఆర్‌టిసి డిపో మేనేజర్, చీరాల

శ్రీనివాసరావు ఫోన్ చేసి ఫిర్యాదు చేసిన మాట వాస్తవమే. బస్‌లో మైనర్ కంప్లయింట్ రావడం వలన ప్రయాణికులను మరో బస్ ద్వారా పంపించాం. బస్సు కండిషన్‌లో ఉంటేనే బయటకు పంపుతాం. లేకుంటే ఎట్టిపరిస్థితిల్లో పంపం. మరోసారి బస్సులను పరిశీలించి శాఖపరమైన చర్యలు తీసుకొంటాం.

వివాహ వేడుకలో ఎమ్మెల్యే గొట్టిపాటి

ప్రజాశక్తి-పంగులూరు

మండలంలోని పలు గ్రామాలలో శనివారం అద్దంకి శాసనసభ్యుడు గొట్టిపాటి రవికుమార్ పర్యటించి, పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. మండలంలోని రామకూరు గ్రామానికి చెందిన రాయనీ శ్రీనివాసరావు, రంగమ్మ దంపతుల కుమార్తె వివాహానికి హాజరై, వధువు భావనను రవికుమార్ ఆశీర్వదించారు. ఆమెకు శుభాకాంక్షలు తెలియజేశారు. బూదవాడ గ్రామంలో శ్రీ సీతారామాంజనేయ స్వామి ఆలయ పున ప్రతిష్ట మహోత్సవ వేడుకకు ముఖ్యఅతిథిగా రవికుమార్ హాజరయ్యారు. ఈ సందర్భంగా తెలుగుదేశం పార్టీ నాయకులు ఆయనకు ఘన స్వాగతం పలికారు. రవికుమార్ దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేద పండితులు ఆయనను దుశ్శాలువాతో సత్కరించి ఆశీర్వదించారు. ప్రజలందరూ సుఖశాంతులతో ఉండాలని, అందరికీ మంచి జరగాలని కోరుకుంటున్నట్లు రవికుమార్ తెలిపారు. ఈ సందర్భంగా బూదవాడ వ్యవసాయ సహకార సంఘం మాజీ ప్రెసిడెంట్ వజ్రాల శ్రీనివాసరెడ్డి రవికుమార్‌ను కలిశారు. మండల తెలుగుదేశం పార్టీ నాయకులు, కొండమంజులూరు గ్రామవాసి చింతల సహదేవుడు సోదరుని దశదినకర్మ సందర్భంగా రవికుమార్ హాజరై, దివంగత చింతల కళ కుమార్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో పర్చూరు శాసనసభ్యులు ఏలూరు సాంబశివరావు కూడా పాల్గొన్నారు.



నూతన వధూవరులను ఆశీర్వదిస్తున్న ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్



మాట్లాడుతున్న గాదె వెంకటరెడ్డి

బాపట్ల వైసీపీలో మాకూ బలముంది

అందుకే వైసిపి టికెట్ మా అబ్బాయికి అడుగుతున్నా: గాదె వెంకటరెడ్డి

ప్రజాశక్తి-బాపట్ల: పదేళ్లుగా బాపట్ల ఎమ్మెల్యేగా మంత్రిగా నియోజకవర్గ అభివృద్ధికి ఎంతగానో కృషి చేశానని బాపట్ల మాజీ శాసనసభ్యులు గాదె వెంకటరెడ్డి అన్నారు. శనివారం బాపట్ల పట్టణం పటేల్ నగర్‌లో ఆయన నివాస గృహంలో జరిగిన విలేకరుల సమావేశంలో వెంకటరెడ్డి మాట్లాడారు. నేను శాసనసభ్యునిగా పనిచేసిన కాలంలో బాపట్ల నియోజకవర్గం అభివృద్ధికి కోట్లాది రూపాయలు ప్రభుత్వ నిధులు వెచ్చించి అభివృద్ధి చేసినట్లు తెలిపారు. బాపట్ల వైసీపీలో తనకు బలం ఉందని అన్నారు. అందుకే తన కుమారుడు మధుసూదనరెడ్డికి బాపట్ల వైసిపి టిక్కెట్ ఇవ్వమని ముఖ్యమంత్రిని అడుగుతున్నట్లు తెలిపారు. బాపట్లలో ప్రభుత్వ కళాశాల ఏర్పాటు, డ్రైనేజీల నిర్మాణం, గ్రామాల్లో అంతర్గత రహదారులు నిర్మించి ప్రజలకు సౌకర్యం కల్పించినట్లు తెలిపారు. బాపట్ల నియోజకవర్గంలో తాను చేసిన అభివృద్ధి దృష్ట్యా ప్రజల్లో తమ కుటుంబం ప్రజా సేవకు రావాలని కోరుకునేవారు ఉన్నారని పేర్కొన్నారు. సమావేశంలో గిరిజారాణి, మద్దాల డేవిడ్, గంపాల వెంకటరెడ్డి, చింతా కిషోర్, చల్లపల్లి నాని, దాసరి, దేగల రవి రెడ్డి, వైసిపి నాయకులు పాల్గొన్నారు.

కెరీర్ డెవలప్‌మెంట్‌పై అవగాహన

ప్రజాశక్తి-వేటపాలెం

సెయింట్ ఆన్స్ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ, చీరాల, బిటెక్ మొదటి సంవత్సరం విద్యార్థులకు కెరియర్ డెవలప్మెంట్‌పై అవగాహనా కార్యక్రమం నిర్వహిం చినట్లు కళాశాల సెక్రటరీ వనమా రామకృష్ణారావు, కరస్పాండెంట్ ఎస్ లక్ష్మణరావు సంయుక్తంగా ఒక ప్రకటన లో తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డాక్టర్ కెవిఎస్ జి మురళీకృష్ణ, (డైరెక్టర్ అకడమిక్స్ అండ్ ప్లానింగ్) విచ్చేసినట్లు కళాశాల ప్రధాన అధ్యాపకులు డాక్టర్ మోయిద వేణుగోపాలరావు తెలిపారు. కళాశాల ప్రధాన అధ్యాపకులు మాట్లాడుతూ విద్యార్థులు శ్రద్ధతో ఉపాధ్యాయులు చెప్పిన విషయాలను అనుసరిస్తూ జ్ఞానాన్ని పెంపొందించుకోవాలని కోరారు. సెయింట్ ఆన్స్ కళాశాల, విద్యార్థుల తల్లిదండ్రులు గర్వించే విధంగా ఉన్నత స్థాయికి చేరుకోవాలని విద్యార్థు లకు తెలియజేశారు. బిటెక్‌లో చేరిన మొదటి సంవత్సరం నుంచే కెరియర్ డెవలప్మెంట్‌పై అవగాహన పెంపొందించు కొని జీవితంలో ఉన్నత స్థాయిలో స్థిరపడాలని ఆకాంక్షిం చారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన డాక్టర్ కెవిఎస్‌జి మురళీకృష్ణ మాట్లాడుతూ విద్యార్థులు ఆత్మ విశ్వాసం కలిగి ఉండాలని, చదివే సమయంలో విద్యార్జనపై దృష్టిని నిలపాలని కోరారు. విద్యార్థులు తాము చేసే ప్రయత్నాల మీదే తమ భవిష్యత్తు ఆధారపడి ఉంటుందని అన్నారు. చిన్న చిన్న అడుగుల ద్వారానే వేల మైళ్ల దూరాన్ని దాటినట్లు ప్రతిరోజు నేర్చుకోవటం ద్వారా ఎంతో విజ్ఞానాన్ని సముపార్జించ వచ్చునని తెలిపారు. నేర్చుకొనే ప్రతి విషయా న్ని అక్షరబద్ధం చేసినట్లైతే అది ఎంతగానో ఉపయోగపడు తుందని తెలిపారు. నేర్చుకున్న విషయాలను ఆచరణలో పెట్టాలని తెలిపారు. విద్యార్థులు ఉత్సాహంగా ఉండి ఇతరులను ఉత్సాహపరచాలని తెలిపారు. కష్టపడి కాకుండా ఇష్టపడి చదవాలని తెలిపారు. నేర్చుకునే విషయాన్ని ఇతరులతో పంచుకోవాలని తెలిపారు. చదువుమీద దృష్టిని పెట్టి మంచి విషయాలను గ్రహించి ఆచరణలో పెట్టాలని సూచించారు. ఈ కార్యక్రమానికి మొదటి సంవత్సరం ఇన్‌ఛార్జి ఎస్ అమర్నాథ్ కన్వీనర్‌గా వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో వివిధ విభాగాధిపతులు అధ్యాపక మరియు అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అధ్యాపకుడు

కోడిపందెం జూదరులు అరెస్టు

ప్రజాశక్తి-నాగులుప్పలపాడు

కోడిపందాల శిబిరంపై దాడులు నిర్వహించి తొమ్మిది మంది పందెం రాయుళ్లను అరెస్టు చేసినట్లు ఎస్ఐ ఉయ్యాల హరిబాబు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు మండల పరిధిలోని దాసరి వారి పాలెం శివార్లలో కోడిపందాలు నిర్వహిస్తుండటంతో ఎస్ఐ ఉయ్యాల హరిబాబు ఆధ్వర్యంలో దాడులు నిర్వహించి తొమ్మిది మంది పందెం రాయుళ్ళు, ఒక పందెంకోడి, 16 కోడి కత్తులు, 36,900 నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు.

విద్యుత్ షాక్‌తో లారీ క్లీనర్ మృతి

ప్రజాశక్తి-సంతనూతలపాడు రూరల్

విద్యుత్ షాక్‌తో లారీ క్లీనర్ మృతి చెందిన సంఘటన మండలంలోని గొర్లమిట్టలో శనివారం సాయంత్రం జరిగింది. అర్ధవీడు మండలం మొహిద్దీన్ పురం నుంచి కట్టెల లోడుతో వచిన లారీ కట్టెలను గొర్లమిట్టలో దించి తిరిగి వెళుతున్న సందర్భంగా 11 కెవి విద్యుత్ తీగల కిందుగా వెళ్లే సమయంలో విద్యుత్ షాక్‌కు గురై లారీ కేబిన్‌లో బయటవైపు కూర్చున్న క్లీనర్ టి మత్తయ్య (49) విద్యుత్ షాక్‌కి గురై అక్కడిక్కడే మతి చెందాడు. ప్రమాదం సంమయంలో ఆ పక్కనే వున్న పచ్చి పొగాకు కూలీలు క్లీనర్‌ను కాపాడే ప్రయత్నంలో ఇద్దరు కూలీలు గాయపడటంతో వారిని 108 వాహనం ద్వారా ఒంగోలు ఆసుపత్రికి పంపించారు. ఎస్ఐ శ్రీకాంత్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆశా పోస్టుకు దరఖాస్తు చేసుకోండి

ప్రజాశక్తి-అద్దంకి

స్థానిక అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ గాజులపాలెం పరిధిలోని రామ్‌నగర్-1 ఆశా కార్యకర్త పోస్టుకు దరఖాస్తు చేసుకోవాలని మెడికల్ ఆఫీసర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆ వార్డులో నివసించే అర్హత గల మహిళా అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. వయసు 25 సంవత్సరాల నుంచి 45 సంవత్సరాల లోపు ఉండి, పదో తరగతి ఉత్తీర్ణులై ఉండాలని పేర్కొన్నారు. 14వ తేదీ లోపు దరఖాస్తులు అందజేయాలని వైద్యాధికారి సూచించారు. మరిన్ని వివరాలకు 81792 98409 నెంబరులో సంప్రదించాలని ఆయన కోరారు.



ప్రజలతో మాట్లాడుతున్న మంత్రి మేరుగు నాగార్జున

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం: మంత్రి

ప్రజాశక్తి-అమృతలూరు

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యంగా పని చేస్తున్నామని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగు నాగార్జున అన్నారు. శనివారం మండల పరిధిలోని ఇంటూరు గ్రామంలో జరిగిన గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామంలో ప్రతి ఇంటికి వెళ్లి గత 3 సంవత్సరాల కాలంలో ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు ప్రజలకు వివరించారు. ఇంకా ప్రజలకు కావాల్సిన అవసరాలు గురించి అడిగి తెలుసుకున్నారు. గ్రామాభివృద్ధి నిరంతర కృషి జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి రాపర్ల నరేంద్ర, రాష్ట్ర యువజన విభాగ కార్యదర్శి వీరభద్ర శ్రీనివాస్‌రెడ్డి, రాష్ట్ర సాహిత్య అకాడమీ డైరెక్టర్ ఓలేటి శివాజీ, సర్పంచ్ మొద్దు జీవమణి, ఎంపిటిసి-1 తమ్ము వెంకట్‌రెడ్డి, ఎంపిటిసి-2 కే ఆనంద్ కుమారి, మాజీ సర్పంచ్ బట్టు మోషే, రాష్ట్ర లీగల్ సెల్ సెక్రెటరీ గుమ్మడి రవిరాజ్, మాజీ సర్పంచ్ కంభం శామ్యూల్, సొసైటీ ప్రెసిడెంట్ కాజా శంకర్‌రెడ్డి, దంతు కృష్ణారెడ్డి, భీమవరపు సాంబిరెడ్డి, దుండి, రాఘవరెడ్డి, అవుతు ముత్తారెడ్డి, ఆర్ మోహన్‌రెడ్డి అమ్మిరి రత్నాకర్ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.



నాగులపాలెంలో వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యులు

300 మందికి వైద్య సేవలు

ప్రజాశక్తి-పర్చూరు: రోటరీక్లబ్ ఆఫ్ పర్చూరు, ఆర్‌సిసి నాగులపాలెం కాటూరి మెడికల్ కాలేజి మరియు హాస్పిటల్ ఆధ్వర్యంలో నాగులపాలెంలో ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరంలో పర్చూరు పరిసర ప్రాంతాల నుంచి వచ్చిన 300 మందికి వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. 70 మందికి ఇసిజి, 20 మందికి ఎకో పరీక్షలు జరిపారు. రోగులకు భోజన సదుపాయం కల్పించారు. క్లబ్ అధ్యక్షులు నాగభైరు శ్రీనివాసరావు మాట్లాడుతూ వైద్యుల సూచనలు పాటిస్తూ ఆరోగ్యం విషయంలో శ్రద్ధ తీసుకోవాలని పేర్కొన్నారు. శిబిరంలో కార్యదర్శి పంబి సదానందరెడ్డి, పాబోలు ఉదయభాస్కర్, బి రాజగోపాల్‌రెడ్డి, మున్నంగి వెంకట సుబ్బయ్య, రమేష్‌చంద్ర, డాక్టర్ సందీప్, మోహిత్‌లతో పాటు పలువురు పాల్గొన్నారు. వైద్య శిబిరానికి సహకారమం దించిన కిషన్‌కుమార్, డాక్టర్ అనితలకు కృతజ్ఞతలు తెలిపారు.

ఎన్నికల నియమావళి పాటించాలి

తహశీల్దార్ రవీంద్రారెడ్డి

ప్రజాశక్తి-యర్రగొండపాలెం



తూర్పు రాయలసీమ ఉపాధ్యాయ, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నోటిఫికేషన్ రావడంతో ప్రతి ఒక్కరూ ఎన్నికల నియమావళి పాటించాలని తహశీల్దార్ కె రవీంద్రారెడ్డి తెలిపారు. ఎన్నికలు పూర్తయ్యే వరకు ఎలాంటి అభివద్ధి కార్యక్రమాలు ప్రారంభించకూడదన్నారు. అలాగే సంక్షేమ పథకాల హామీలు, పంపిణీ చేపట్టరాదన్నారు. రాజకీయ పార్టీలకు చెందిన ఫ్లెక్సీలు ఏర్పాటు చేయకూడదని తెలిపారు. మండలంలో ఉపాధ్యాయుల ఓట్లు 63, పట్టభద్రుల ఓటర్లు 1461 ఉన్నారన్నారు. యర్రగొండపాలెంలో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఓటర్ల కొరకు ఒకటి, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటర్ల కొరకు ఒకటి చొప్పున పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయనున్నట్లు ఆయన తెలిపారు.

వివాదాలకు పరిష్కార వేదిక 'లోక్‌అదాలత్'

జిల్లా ఇన్‌ఛార్జి ప్రధాన న్యాయమూర్తి శివకుమార్

ప్రజాశక్తి-ఒంగోలు క్రైం

వివాదాల పరిష్కారానికి లోక్‌అదాలత్ చక్కటి పరిష్కారవేదికని జిల్లా ఇన్‌ఛార్జి ప్రధాన న్యాయమూర్తి ఆర్.శివకుమార్ పేర్కొన్నారు. శనివారం జాతీయ లోక్‌అదాలత్ స్థానిక జిల్లా న్యాయస్థానంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి మాట్లాడుతూ రాజీ పడదగిన అన్ని క్రిమినల్ కేసులు మరియు అన్ని రకాల సివిల్ తగాదాలు ఇరువర్గాల ఆమోదంతో పరిష్కరించబడతాయన్నారు. పరిష్కారం కోసం న్యాయమూర్తులు కూడా సహాయపడతారని తెలిపారు. పొలాల యజమానులు రెవెన్యూ చట్టాల గురించి అవగాహన కలిగి ఉండాలని, అదేవిధంగా భూములు వర్గీకరణ గురించి తెలుసుకోవాలని అన్నారు. జాతీయ లోక్‌అదాలత్‌లో 16 వేల కేసులు పరిష్కరించడం జరిగిందన్నారు. జిల్లా న్యాయసేవాధికార సంస్థ, ఇతర అధికారుల, న్యాయవాదుల సహకారంతో కేసులు పరిష్కారానికి కృషి చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో న్యాయమూర్తులు ఎం.సోమశేఖర్, బి.సత్యకుమారి, ఎస్.విజయలక్ష్మి, పర్మినెంట్ లోక్‌అదాలత్ ఛైర్మన్ నరసింహరాజు, పోలీస్ అధికారులు, బార్‌అసోసియేషన్ అధ్యక్షులు జి.శ్రీనివాస రావు, ఇతర అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా ఇన్‌ఛార్జి ప్రధాన న్యాయమూర్తి శివకుమార్

'పేస్' కళాశాలలో ప్రాంగణ ఎంపికలు

ప్రజాశక్తి-టంగుటూరు

స్థానిక పేస్ ఇంజనీరింగ్ కళాశాలలో హైదరాబాద్‌కు చెందిన ప్రముఖ సంస్థ 247 ఎఐ ఆధ్వర్యంలో సోమవారం ప్రాంగణ ఎంపికలు నిర్వహించనున్నట్లు కళాశాల కరస్పాండెంట్ మద్దిశెట్టి శ్రీధర్ తెలిపారు. శనివారం స్థానిక పేస్ కళాశాలలో ఆయన మాట్లాడుతూ ఈ ఎంపికలకు జిల్లాలోని వివిధ కళాశాలలకు చెందిన 2022 - 23 బ్యాచ్ డిగ్రీ, బి టెక్, ఎంబీఏ, ఇతర అన్ని బ్రాంచీల విద్యార్థులు హాజరు కావచ్చునని చెప్పారు. ప్రాంగణ ఎంపికలకు హాజరగు విద్యార్థులు తమ బయోడేటాతో పాటు 2 పాస్ పోర్ట్ ఫోటోలతో సోమవారం ఉదయం 9 గంటలకు పేస్ కళాశాలకు విచ్చేసి రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు. ఇతర వివరాలకు సెల్ నెం.95814 56303ను సంప్రదించాలని కరస్పాండెంట్ మద్దిశెట్టి శ్రీధర్ సూచించారు.

హెల్మెట్ ధరించి వాహనాలు నడపాలి

సిఐ రాజేష్‌కుమార్

ప్రజాశక్తి-కంభం రూరల్

ద్విచక్రవాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించి వాహనాలు నడపాలని కంభం సర్కిల్ సిఐ రాజేష్‌కుమార్ ఆదేశించారు. శనివారం కంభం సర్కిల్ పోలీస్‌స్టేషన్‌లో ఆయన మాట్లాడుతూ అమరావతి-అనంతపురం జాతీయ రహదారిపై చోటుచేసుకుంటున్న రోడ్డు ప్రమాదాలపై ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ముఖ్యంగా ద్విచక్ర వాహనదారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ హెల్మెట్ ధరించకుండా వాహనాలు నడిపి.. ప్రమాదాల బారిన పడి మృతి చెందుతున్నారని అన్నారు. ప్రమాదం చోటు చేసుకుంటున్న సమయంలో ద్విచక్ర వాహనదారులకు తలకు బలమైన గాయాలు కావడం వల్ల చనిపోతున్నారని, ఈ విషయాన్ని ద్విచక్ర వాహనదారులు గుర్తించి తప్పనిసరిగా హెల్మెట్ ధరించి వాహనాలు నడపలన్నారు. రోడ్డు ప్రమాదాలు నివారించేందుకు వాహనదారులు పోలీసులకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ప్రతి శనివారం జిల్లా ఎస్పీ ఆదేశాలతో నో యాక్సిడెంట్ డే కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు.



సిఐ రాజేష్‌కుమార్

గృహ సారథులే జగనన్న రథసారథులు

రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి సురేష్

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులే జగనన్న రథసారథులని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ అన్నారు. శనివారం యర్రగొండపాలెంలోని అంబేద్కర్ భవనంలో వైసిపి మండల కన్వీనర్ కెసిహెచ్ ఓబుల్‌రెడ్డి అధ్యక్షతన సచివాలయ కన్వీనర్లు, గహ సారథులకు సమావేశం నిర్వహించారు. మంత్రి సురేష్ మాట్లాడుతూ సీఎం జగన్మోహన్‌రెడ్డి సచివాలయ వ్యవస్థతో పాలనను గ్రామస్థాయికి తీసుకువెళ్లారన్నారు. నవరత్నాల పథకాల ద్వారా జనరంజక పాలన సాగిస్తున్నారన్నారు. జగనన్న అమలు చేసిన పథకాలను ప్రజల్లోకి విస్తతంగా తీసుకెళ్లాలన్నారు. అందుకు సచివాలయ కన్వీనర్లు, గహ సారథులు, వలంటీర్లతో కలిసి పని చేయాలన్నారు. ఒక్కో కుటుంబాలకు చేకూరిన లబ్ధి, వార్డు, మండలం, నియోజకవర్గంలో జరిగిన అభివద్ధి గురించి తెలియజేయాలన్నారు. వంట గ్యాస్, పెట్రోలు, డీజిల్ ఇతర నిత్యావసరాల పెరుగుదల అంశాలు కేంద్ర ప్రభుత్వం పరిధిలోని అంశాలని ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. రాష్ట్రాభివద్ధికి అడ్డంకులు సష్టిస్తున్నా ప్రతిపక్షాలు, ఎల్లో మీడియా కుట్రలు, టీడీపీ పాలనలోని వైఫల్యాలను వివరించాలన్నారు. అందుకు మీరంతా జగనన్న కుటుంబంలా పని చేయాలన్నారు. 2024లో ఎన్నికలే లక్ష్యంగా వైసీపీని తిరిగి అధికారంలోకి తీసుకువస్తే మరో 30 ఏళ్ల పాటు వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉండటం తథ్యమన్నారు. గడిచిన మూడున్నరేళ్లలో ఏ విధంగా పార్టీకి పనిచేశారో మరో ఒకటిన్నర సంవత్సరం పాటు రెట్టింపు ఉత్సాహంతో పనిచేయాలన్నారు. ఏ ఒక్క అర్హుడికి అన్యాయం జరగకూడదనేదే ప్రభుత్వ లక్ష్యమన్నారు. పార్టీ కోసం పనిచేసిన ప్రతి కార్యకర్తకు గుర్తింపు ఉంటుందన్నారు.



మాట్లాడుతున్న మంత్రి సురేష్

అర్హతే ప్రమాణికంగా సంక్షేమ పథకాలు..

పార్టీలు, వర్గాలు, కులమతాలు చూడకుండా అర్హతే ప్రమాణికంగా సంక్షేమ పథకాలను అమలు చేసిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోమోహన్‌డ్డికి దక్కుతుందని మంత్రి సురేష్ చెప్పారు. రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల్లో తన 3,648 కిలోమీటర్ల సుదీర్ఘ పాదయాత్ర ద్వారా అన్ని వర్గాల ప్రజల సమస్యలను ప్రత్యక్షంగా చూసిన జగనన్న నవరత్నాలతో పాటు అనేక సంక్షేమ పథకాలను ప్రజలకు అందిస్తున్నారన్నారు. ప్రభుత్వ పాఠశాలలను నాడు-నేడు కార్యక్రమం ద్వారా అభివద్ధి చేయడంతో పాటు గతంలో ఎన్నడూ లేని సౌకర్యాలను ప్రభుత్వ పాఠశాలలో కల్పించి, పేద విద్యార్థుల భవిష్యత్‌కు బంగారు బాట వేస్తున్నారన్నారు.

వైసీపీ 175 సీట్లు గెలవడం ఖాయం..

టీడీపీ నేతలు ఎన్ని కుట్రలు చేసినా రానున్న ఎన్నికల్లో వైసీపీ 175 సీట్లు విజయం సాధించడం ఖాయమన్నారు. వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఏది చెప్పినా కచ్చితంగా చేసి తీరుతారన్నారు.ప్రభుత్వ పథకాల ప్రచార కిట్లను గహ సారథులకు పంపిణీ చేశారు. ప్రతి గడపకూ వెళ్లి ప్రజల అభీష్టం మేరకు వారి ఇళ్లకు స్టిక్కర్లను అతికించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎంసి ఛైర్మన్ ఉడుముల శ్రీనివాసరెడ్డి, ఎంపిపి దొంతా కిరణ్ గౌడ్, జడ్పిటిసి చేదూరి విజయభాస్కర్, జిల్లా కో ఆప్షన్ సభ్యుడు సయ్యద్ షాబీర్ బాషా పాల్గొన్నారు.

దళితులకు రక్షణేదీ?



పెత్తందారులు బరితెగించి దళితులపై దాడులకు తెగబడుతున్నారు. వేమూరు నియోజకవర్గం, కొల్లూరులో చోటుచేసుకున్న ఘటన ఇందుకు తార్కాణంగా నిలుస్తోంది. కష్ణా నదిపరివాహక ప్రాంతంలోని లంక భూములను తమకు ఇస్తే సాగు చేసుకుని జీవనం సాగిస్తామని కొల్లూరు మండలం చింతలంక, పెదలంక దళితులు, పేదలు ప్రభుత్వాన్ని కోరుతూ వచ్చారు. వ్యవసాయ కార్మిక సంఘం, కౌలు రైతు సంఘం ఆధ్వర్యంలో 100 ఎకరాల భూమిని బాగు చేసి సాగుకు సిద్ధం చేసుకునే ప్రయత్నాలు చేశారు. ఈ ప్రాంతంలో ఇసుక అక్రమ రవాణా సాగిస్తున్న పెత్తందారులు దళితులపై దాడి చేసి.. గాయపరిచారు. రాష్ట సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగ నాగార్జునకు చెందిన వేమూరు నియోజకవర్గంలో పెత్తందారులు దళితులపై మూకమ్మడి దాడికి తెగబడితే మంత్రి మౌనం దాల్చటం గమనార్హం. దీనికి తోడు బాధితుల పక్షాన నిలబడిన కౌలురైతు సంఘం నేత తోడేటి సురేష్‌పై పోలీసులు కేసు నమోదు చేసి.. జైలుకు పంపడాన్ని చూస్తుంటే ఈ ప్రభుత్వం ఎవరి పక్షాన ఉంటుందో అర్థం చేసుకోవచ్చు.

ఢిల్లీ లిక్కర్ స్కామ్‌లో వైసీపీ ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి కుమారుడు రాఘవరెడ్డిని ఈడీ అధికారులు అరెస్టు చేయడం సంచలనమైంది. ఈ స్కామ్‌కు సంబంధించి ఏపీలో ఇదే తొలి అరెస్ట్ కావడం అధికార వైసిపి నేతల్లో కలకలం రేపింది. ఈ ఘటనతో ఎంపీ మాగుంట ఒంగోలులో జరపాల్సిన పర్యటనను రద్దు చేసుకున్నారు. ఇప్పటికే పలు పర్యాయాలు ఎంపీ మాగుంట ఈ స్కామ్‌కూ, తమకూ ఎలాంటి సంబంధం లేదని చెబుతూ వచ్చారు.

బాపట్ల జిల్లాలోని సూర్యలంక బీచ్ పర్యటనకు వచ్చిన రాష్ట్ర పర్యాటక, సాంస్కతిక శాఖ మంత్రి ఆర్.కె.రోజా మరోసారి వివాదంలో చిక్కుకున్నారు. సూర్యలంకలోని పర్యాటక శాఖ ఆధీనంలో నడుస్తున్న హరిత బీచ్ రిసార్ట్‌లో కొంతసేపు గడిపిన మంత్రి సముద్రం ఒడ్డున ఉన్న అలల్లో నడుస్తూ తన చెప్పులను ఒడ్డున పెట్టారు. వాటిని పర్యాటక శాఖ ఉద్యోగి ఒకరు చేతులతో మోసుకొచ్చి మంత్రికి తిరిగి ఇవ్వడం వివాదమైంది. అలల తాకిడికి చెప్పులు కొట్టుకుపోతాయని తానే వాటిని తీసుకుని మంత్రికి ఇచ్చినట్లు సదరు ఉద్యోగి చెప్పటం గమనార్హం.

సిపిఎం రేపల్లె తాలూకా అమరవీరుల స్మారకసభ ఆ ప్రాంత పార్టీ నేతృత్వంలో జరిగింది. ఆంధ్రరాష్ట్ర కమ్యూనిస్టు ఉద్యమంలో పోరాటాల పురిటిగడ్డ పాత రేపల్లె తాలూకా ఉద్యమానిది కీలకమైన పాత్ర. కమ్యూనిస్టుల నాయకత్వాన కష్టజీవుల ఉద్యమాలు ఎన్నో జరిగాయి. రేపల్లె ప్రాంతంలో ప్రజల కోసం పోలీస్ కాల్పుల్లో మరణించిన అమరవీరులు దాసరి సుబ్బయ్య, మోటూరి వెంకటరత్నం, గుమ్మడి సీతారామయ్య, కంఠంనేని వెంకటరత్నం, కస్తూరి కుటుంబరావు, మండవ కోటేశ్వరరావు, ముత్తురెడ్డి వెంకటాచలంకు నివాళులర్పించారు.

తమ సమస్యల పరిష్కారం కోసం అంగన్‌వాడీ కార్యకర్తలు ప్రకాశం, బాపట్ల జిల్లాల కలెక్టర్ కార్యాలయాల వద్ద భారీ ధర్నా నిర్వహించారు. బాపట్ల జిల్లా కలెక్టర్ వద్దకు తమని పంపించకపోవడంతో అంగన్వాడీలకు, పోలీసులకు మధ్య కాసేపు వాగ్వివాదం జరిగింది. అనంతరం కలెక్టర్‌కు అంగన్‌వాడీలు తమ సమస్యలు విన్నవించారు.

ఉపాధ్యాయ, పట్టభద్రుల కోటాలో ఎంఎల్‌సి ఎన్నికల దష్ట్యా ఎలక్షన్ కోడ్ అమలులోకి వచ్చింది. దీంతో ఎన్నికలు ముగిసే వరకు స్పందన కార్యక్రమాలను నిలిపివేస్తున్నట్లు అధికారులు ప్రకటించారు. అన్ని ప్రాంతాల్లో ఉన్న రాజకీయ నేతల విగ్రహాలకు అధికారులు ముసుగులు తొడిగారు. గడపగడపకూ కార్యక్రమంలో కూడా అధికారులు పాల్గొనే అవకాశం లేకపోవడంతో ఎమ్మెల్యేలు, ఇన్‌ఛార్జీలే ఈ కార్యక్రమంలో పాల్గొంటున్నారు. గ్రాడ్యుయేట్, ఉపాధ్యాయ శాసనమండలి ఎన్నికలు మార్చి 13వ తేదీన జరుగనున్నాయి. ప్రకాశం జిల్లా లోని అన్ని నియోజకవర్గాలతో పాటు, బాపట్ల జిల్లాలోని చీరాల,అద్దంకి, పర్చూరు నియోజకవర్గాలకు చెందిన గ్రాడ్యుయేట్, ఉపాధ్యాయ ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకోనున్నారు. మార్చి 13వ తేదీన ఎన్నికలు జరుగుతాయి.

- ప్రజాశక్తి -బాపట్ల జిల్లా